**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499

సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

A.P VISION TV

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499


యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్: పేరపోగు వెంకటేశ్వర్లు | మంగళవారం 10-06-2025 | సంపుటి : 11 | సంచిక : 135 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


## సిలికాన్ వ్యాలీలా క్వాంటమ్ వ్యాలీకి ప్రత్యేక గుర్తింపు




అమరావతి, జూన్ 09: సిలికాన్ వ్యాలీలా అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఒక ప్రత్యేక గుర్తింపు పొందాలని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సోమవారం రాజధాని అమరావతిలో ఏపీ స్టేట్ క్వాంటమ్ మిషన్‌పై సచివాలయంలో ఐటీ రంగం నిపుణులతోపాటు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. జూన్ 30వ తేదీన క్వాంటమ్ మిషన్‌పై విజయవాడలో వర్క్ షాపు నిర్వహిస్తున్నామన్నారు. క్వాంటమ్ వాలీ ఎకో సిస్టం ఏర్పాటుపై అభిప్రాయాలను ఈ సందర్భంగా ఆయన సేకరించారు. రెండు దశల్లో మిషన్‌కు రూ. 4 వేల కోట్లు వ్యయమవుతుంది అంచనా వేశారు. అమరావతి నగరంలో క్వాంటమ్ వ్యాలీ పేరిట భారీ ప్రాజెక్ట్ ప్రారంభకానుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా అమరావతి ఒక అంతర్జాతీయ స్థాయి సాంకేతిక కేంద్రంగా మారబోతుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఫ్యూచర్ టెక్నాలజీలపై శిక్షణ, పరిశోధన, ఉద్యోగాలు అందించే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి క్వాంటమ్ కంప్యూటింగ్ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు ఇప్పటికే సీఎం చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులోభాగంగా గతే నెల మే మొదటి వారంలో ఏపీ ప్రభుత్వం, ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలతో ఏపీ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. భవిష్యత్తు అవసరాలన్నీ క్వాంటం కంప్యూటింగ్‌పైనే ఆధారపడి ఉంటాయని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అందుకే అమరావతిని క్వాంటం వ్యాలీగా చేయాలని సంకల్పించినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. సిలికాన్ వ్యాలీ తరహాలో క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దాలని సంస్థల ప్రతినిధులకు సీఎం చంద్రబాబు సూచించిన సంగతి తెలిసిందే. ఇక హైదరాబాద్‌లోని హైటెక్ సిటీని కేవలం 15 నెలల్లో నిర్మించారని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. అలాగే క్వాంటమ్ వ్యాలీని సైతం అతి తక్కువ సమయంలో నిర్మించ వచ్చునన్నారు. ఇప్పటికే ఎల్ అండ్ టీకి స్థలాన్ని కేటాయించిన విషయం విదితమే.

## 11 ఏళ్ల మోదీ పాలన స్వర్ణయుగం: అమిత్‌షా

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 11 ఏళ్ల పాలనను స్వర్ణయుగంతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా (ంఎతిబి వాష్ట్రజీష్ట్ర) పోల్చారు. చెక్కుచెదరని సంకల్పం, అవిశ్రాంత కృషి, ప్రజాసేవ పట్ల అంకిత భావంతో కూడిన స్వర్ణయుగంగా మోదీ పాలనను పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం మూడోసారి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా అమిత్‌షా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ఈ పదకొండేళ్లలో ఆర్థిక పునరుద్ధరణ, సామాజిక న్యాయం, సాంస్కృతిక గౌరవం, జాతీయ భద్రతతో కొత్త శకాన్ని దేశం చూస్తోందని అమిత్‌షా అన్నారు. బలమైన నాయకత్వం, దృఢ సంకల్పం, ప్రజాసేవ చేయాలనే తపన ఉంటే సుపరిపాలన సాధ్యమేనని మోదీ ప్రభుత్వం నిరూపించిందని వివరించారు. 2014లో పరిస్థితిని ప్రస్తావిస్తూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పగ్గాలు



చేపట్టినప్పుడు దేశంలో విధానపరమైన అచేతన స్థితి, నాయకత్వ కొరత, తారాస్థాయిలో అవినీతి ఉండేదని చెప్పారు. ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేదని, దిశానిర్దేశం లేని పాలన కొనసాగేదని అన్నారు. 'గరిష్ట పాలన-కనిష్ఠ ప్రభుత్వం' అనే సిద్ధాంతంతో గత 11 ఏళ్లుగా అభివృద్ధి వేగాన్ని పునర్నిర్వచించామని చెప్పుకొచ్చారు. రైతులు, మహిళలు, వెనుకబడిన తరగతులు, దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి మోదీ విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. బుజ్జగింపు విధానాలకు బదులు సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్‌తో దేశాన్ని ముందుకు తీసుకెళ్లారని ప్రశంసించారు. జాతీయ భద్రత పరంగా సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ నక్సలిజం చివరి దశలో ఉందని, జమ్మూకశ్మీర్, ఈశాన్య భారతంలో శాంతిని పునరుద్ధరించామని, ఇండియా ఇప్పుడు ఉగ్రవాదంపై అసాధారణ రీతిలో వ్యవహరిస్తోందని కొనియాడారు. ఉగ్రవాదంపై ఉక్కుపిడికిలి బిగించిందని, అవసరమైతే శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లయినా ఉగ్రవాదులను మట్టుబెడుతుందని చెప్పారు.

## విద్యా శాఖలో అనేక తప్పిదాలు చేసిన గత ప్రభుత్వం

కాకినాడ, జూన్ 09: కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేస్తున్నామని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. కాకినాడలోని స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో షైనీ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవానికి మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యాశాఖలో అనేక తప్పిదాలు చేసిందని విమర్శించారు. 2014 - 19 మధ్య తాను మంత్రిగా ఉన్న సమయంలో 2 వేల మున్సిపల్ స్కూల్స్‌లో కాంపిటీటివ్ పరీక్షలకు కోచింగ్ ఇచ్చామని వివరించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో వాటన్నింటినీ రద్దు చేసిందని చెప్పారు. ప్రైవేట్ విద్యాసంస్థల కంటే బెస్ట్ టీచర్లు ప్రభుత్వ స్కూళ్లలోనే ఉంటారన్నారు. ఎందుకంటే.. గవర్నమెంట్ పరీక్షల్లో సెలెక్ట్ కాని వారు ప్రైవేట్ స్కూళ్లకు టీచర్లుగా వెళ్తారని ఆయన వివరించారు. చదువులకు పేదరికం అడ్డు కాకూడదనేదే తమ ప్రభుత్వం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మా నాన్నగారు బస్సు కండక్టర్‌గా పని చేశారని.. ఆయన కేవలం 8వ తరగతి వరకూ మాత్రమే చదువుకున్నారని ఈ సందర్భంగా మంత్రి నారాయణ గుర్తు చేసుకున్నారు. తాను చదివింది కూడా గవర్నమెంట్ స్కూల్లోనేనని ఆయన వివరించారు. హార్డ్ వర్క్ చేసి మంచి ప్రణాళికతో చదువుకుంటే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఆయన తెలిపారు. ఇదే విధానాన్ని మా నారాయణ విద్యా సంస్థల్లో ఫాలో అవుతున్నామన్నారు. మా నారాయణ విద్య సంస్థల్లో 6 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. 60 వేల మంది డైరెక్ట్ ఉద్యోగులు, మరో 60 వేల మంది ఇండైరెక్ట్ ఉద్యోగులున్నారని చెప్పారు. అయితే 2008 వరకూ ఉమ్మడి ఏపీకి ఐఐటీ ర్యాంకులు వచ్చేవి కావన్నారు. కానీ ఆ తర్వాత మొదటిసారి నారాయణ విద్యార్థికి దేశవ్యాప్తంగా ఫస్ట్ ర్యాంక్ వచ్చిందని పేర్కొన్నారు. కష్టపడి చదవండి.. అనుకున్న లక్ష్యం సాధించుకోవాలని విద్యార్థులకు మంత్రి నారాయణ సూచించారు. కాకినాడ జిల్లాలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 132 మంది, ఇంటర్‌లో 36 మంది విద్యార్థులకు అవార్డులను మంత్రి నారాయణ ప్రదానం చేశారు. ఒక్కొక్క విద్యార్థికి రూ. 20 వేల నగదు, ప్రశంసా పత్రం, మెడల్‌ను మంత్రి నారాయణ అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా ఉన్నతాధికారులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.



## ఏమిటీ భాష? ఏమిటీ విపరీత ప్రవర్తన? వైసీపీ నేత సజ్జలపై నారా లోకేష్ ఆగ్రహం



ఇంటర్నెట్ డెస్క్: తమను అవమానించిన వారి ఫోటోల వద్ద మహిళలు ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలియజేస్తే, వైసిపి నాయకులకు సంకరజాతి వారుగా కనిపిస్తున్నారా? అంటూ నిలదీశారు ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. ఏమిటీ ఈ భాష? ఏమిటీ విపరీత ప్రవర్తన? అంటూ విస్మయం వ్యక్తం చేశారు. తల పండిన సాక్షి జర్నలిస్టులు మహిళలను వేశ్యలు అంటూ అవమానించారు.. ఇప్పుడు వైసిపి నేతలు మహిళల్ని కించపరుస్తూ సంకరజాతి అంటూ దిగజారి మాట్లాడుతున్నారు అని లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు అంటే ఎందుకు ఇంత చిన్నచూపు! జగన్ రెడ్డి గారు తల్లి, చెల్లిని తరిమేసిన అమానవీయ ప్రవర్తనను వైసిపి నేతలు ఆదర్శంగా తీసుకున్నట్టు ఉన్నారని లోకేష్ అన్నారు. మహిళల జోలికి వస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పనిసరిగా తీసుకుంటామని లోకేష్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అటు, పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన షైనింగ్ స్టార్స్ అవార్డ్స్-2025లో భాగంగా పార్వతీపురంలో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిధిగా హాజరయ్యాం౯. ఒనీనివ బష్ట్ర-2. తీజూణఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన 95మంది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబర్చిన 26మంది విద్యార్థులకి మంత్రి నారా లోకేష్ అవార్డులు అందజేశారు. ఙప్రభుత్వ విద్యావ్యవస్థను ప్రైవేటు రంగానికి మించి అద్భుతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో విద్యారంగంలో అనేక సంస్కరణలు తెస్తున్నామని లోకేష్ చెప్పారు. అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్నాం.. సంస్కరణల ద్వారా రాబోయే నాలుగేళ్లలో ఏపీ విద్యారంగంలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తామని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

## ఘోర ప్రమాదం..

### రైలు నుంచి పడి ఐదుగురు మృతి

ముంబై: నగరంలో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. లోకల్ ట్రైన్ నుంచి కింద పడి ఐదుగురు మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ఉదయం ఓ లోకల్ ట్రైన్ ముంబై 'ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్' నుంచి థానేలోని కసరా ఏరియాకు బయలు దేరింది. ప్రయాణికులతో ఆ రైలు కిక్కిరిసిపోయింది. బస్సు డోరు దగ్గర వేలాడినట్లు.. కొంతమంది ప్రయాణికులు రైలు డోరు దగ్గర వేలాడుతూ ప్రయాణం చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రయాణికుల అధిక రద్దీ కారణంగా తోపులాట జరిగింది. డోరు దగ్గర ఉన్న 10 నుంచి 12 మంది ప్రయాణికులు కింద పడిపోయారు. వారిలో ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. మిగిలిన వారు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని హుటాహుటిన దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే, ప్రమాదం జరగడానికి గల అసలు కారణం ఏంటో తెలియరాలేదు. తోపులాట కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.




## వర్తమానం ఊసెత్తకుండా 2047 గురించి కలలా? రాహుల్ ఘాటు విమర్శ

న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో జవాబుదారీతనం లోపించిందని, కేవలం ప్రచారార్భాటమే కనిపిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ అన్నారు. వర్తమానం గురించి కేంద్రం మాట్లాడటం మానేసి 2047 గురించి కలలు కంటోందని విమర్శించారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో ప్రయాణికులతో కిక్కిరిసిన లోకల్ ట్రైన్ నుంచి కిందపడి నలుగురు ప్రయాణికులు ఆదివారం మృతిచెందడం, ఆరుగురు గాయపడిన ఘటన అనంతరం రాహుల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈ విమర్శలు గుప్పించారు. మోదీ ప్రభుత్వం 11 ఏళ్లు సేవలను సెలబ్రేట్ చేసుకుంటుంటే.. ముంబై నుంచి వచ్చిన విషాద వార్త వాస్తవ పరిస్థితికి అద్దంపడుతోందని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. రైలు నుంచి పడి పలువురు ప్రాణాలు కోల్పోయారని, కోట్లాది మంది ప్రజలకు భారత రైల్వేలు వెన్నెముక వంటిదని, కానీ ఈరోజు ఆ సంస్థ అభద్రత, రద్దీ, గందరగోళానికి చిహ్నంగా మారిందని ఆరోపించారు.



## నిరసన తెలుపుతున్న రాజధాని ప్రజలపై నోరు పారేసుకున్న సజ్జల..

అమరావతి, జూన్ 09: రాజధాని అమరావతి మహిళలపై వైసీపీకి చెందిన సాక్షి టీవీ చర్చ కార్యక్రమంలో జర్నలిస్ట్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. అలాంటి వేళ వైసీపీ నేతలు తమ తీరు మార్చుకోవడం లేదు. సాక్షిలో చేసిన ఆ వ్యాఖ్యలను పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి సమర్థించారు. అలాగే రాజధాని మహిళలపై అక్కసు వెళ్లగక్కుతూ తీవ్ర పదజాలంతో దూషించారు. సోమవారం ఆయన అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నిరసనలు చేస్తున్న మహిళలను పిశాచాలు, రాక్షసులు అంటూ సజ్జల వ్యాఖ్యానించారు. ఆవేదనతో నిరసనలు చేస్తున్న రాజధాని మహిళలను సంకర తెగ అంటూ తీవ్ర పదజాలంతో దూషించారు. నిరసనలు చేసిన తెగ అర్గనైజ్డ్‌గా ఉన్న సంకర తెగ అంటూ సజ్జల రామకృష్ణారెడ్డి అనడం సంచలనంగా మారింది. సాక్షి మీడియాలో ఇటీవల చర్చ కార్యక్రమంలో జర్నలిస్ట్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. రాజధాని అమరావతి వేశ్యల రాజధాని అంటూ కామెంట్ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ వ్యాఖ్యలను ఖండించలేదు. అంతేకాకుండా.. ఈ వ్యాఖ్యలను ఆయన చాలా సాదా సీదాగా తీసుకున్నారు. అయితే ఈ చర్చ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలపై అమరావతి ప్రాంత మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



# సంపాదకీయం

మంగళవారం 10-06-2025

## కోలుకుంటున్న పహల్గాం

ఎంతో కష్టపడి ఒక అడుగు ముందుకు వేస్తే కలిసి రాని కాలం పదడుగులు వెనక్కి తోసినట్టుంది కశ్మీర్ అభివృద్ధి పరిస్థితి. ఉగ్రవాదుల పు ణ్యమా అని అక్కడి సామాన్య ప్రజల అవస్థలు 'కక్కలేక, మింగలేక' అన్నట్టుగానే ఉ న్నాయి. అత్యంత దుర్మార్గమైన పహల్గామ్ దాడి తర్వాత కశ్మీర్‌లో కొత్త సంక్షోభం తలెత్తుతోంది. అదే పర్యాటక వినాశనం. ఏప్రిల్ 22, 2025న పహల్గాంలోని బైసరన్ లోయలో అమాయక పర్యాటకులపై దుర్మార్గపూరితమైన దాడి జరిగిందిఫలితంగా 26 మంది అత్యంత విషాదకరంగా ప్రాణాలు కోల్పోయారు. ఆ వెంటనే, ఆ ప్రాంతంలో గణనీయమైన అశాంతి నెలకొంది. ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న వారి ఇళ్లను అధికారులు కూల్చివేశారు. చాలామందిని అదుపులోకి తీసుకున్నారు. కశ్మీర్‌లోని 87 పర్యాటక ప్రదేశాలలో 48 ప్ర దేశాల సందర్శనలను కూడా నిషేధించారు. పర్యాటక రంగంపై ఎక్కువగా ఆధారపడిన ఈ ప్రాంతంలో స్థానిక ఆర్థిక వ్యవస్థను ఇది తీవ్రంగా ప్రభావితం చేసిం ది. దాడి తర్వాత కొన్ని వారాల నుంచి హోటళ్ళు, విమానాల రద్దు గణనీయంగా పెరిగాయి. చాలామంది పర్యాటకులు ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టారు. వేరే మార్గం లేకపోవడంతో చాలా హోటళ్ళు తమ సిబ్బం దిని తొలగించాల్సి వచ్చింది. వీరిలో చాలామంది కశ్మీర్‌లోని చిన్న పట్టణాల నుంచి వలస వచ్చినవారు. కాగా, తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ కశ్మీర్‌లోని చినాబ్ వంతెనను ప్రారంభిస్తూ, అభివృద్ధిని ఉగ్రవాదులు ఎంతగా దెబ్బతీయాలని చూసినా ఆపేది లేదని స్పష్టం చేశారు. కశ్మీర్ ప్రజలకు జీవనాధారమైన పర్యాటకాన్ని పాకిస్థాన్ లక్ష్యంగా చేసుకుందని ప్రధాని మోదీ అన్నారు. పాకిస్థాన్ కుట్రకు వ్యతిరేకంగా జమ్మూ కశ్మీర్ ప్రజలు నిలబడిన విధానాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈసారి కశ్మీర్ ప్రజలు చూపిన బలం పాకిస్తాన్‌కు మాత్రమే కాక యావత్ ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదానికి స్పష్టమైన సందేశాన్ని పంపినట్టయ్యిందని" ప్రధాని మోదీ పేర్కొన్నా రు. జమ్మూ కశ్మీర్ యువత ఇప్పుడు ఉగ్రవాదానికి తగిన సమాధానం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఉత్తర భారతదేశంలోని జమ్మూ కశ్మీర్‌కు చెందిన అనంత్‌నాగ్ జిల్లాలోని పట్టణమే పహల్గాం. అనంతనాగ్ నగరానికి 45 కి.మీ. దూరంలో, లిడ్డర్ లోయ లో, లిడ్డర్ నది ఒడ్డున, హిమాలయాలలో సముద్రానికి సుమారు 7,200 అడుగుల ఎత్తులో ఉంది. పహల్గాం ప్రసిద్ధ పర్యాటక కేంద్రమేకాక హిల్ స్టేషన్ కూడా. ఇది హిందువులు అత్యంత పవిత్రంగా భావిం చి, ప్రతీ ఏడూ జరిపే సాహసోపేత యాత్ర అమర్‌నాథ్‌కు ప్రారంభ స్థానం. సంవత్సరం ప్రపంచం నలుమూలల నుం చి వేలాదిమంది పర్యాటకులు పహల్గాంకు వస్తుంటారు. 2025లో పహల్గాం ఉగ్రదాడి జరిగిన నాటినుంచి ఇక్కడ పర్యాటకం పెద్ద ఎత్తున మూలకు పడింది. 'పహ ల్గామ్' అనే పేరు కశ్మీరీ పదాల నుంచి వచ్చింది. 'పుహేల్' అంటే 'గొర్రెల కాపరి', 'గోమ్' అంటే 'గ్రామం' అని అర్థం. ఇది కాలక్రమేణా పుహెల్గోమ్‌గా, పహల్గామ్‌గా మారింది. ఈ పట్టణ ప్రదేశం చుట్టుపక్కల అనేక పచ్చిక బయళ్లు ఆకర్షణీయంగా యాత్రికులకు కనువిందు చేస్తుంటాయి. ఇక్కడ బఖర్వాల్ ప్రజలు వేసవికాలం నుం చి చలికాలం ప్రారంభం వరకు వారి పశువులను మేపుకుంటూ తాత్కాలిక నివాసం ఏర్పరచుకుంటారు. హిందూ సంప్రదాయాల ప్రకారం పహల్గామ్‌ను మొదట బై ల్‌గావ్ (ఎద్దుల గ్రామం) అని పిలిచేవారు. అమర్నాథ్ గుహలోకి ప్రవేశించే ముందు శివుడు, నందిని ఇక్కడే విడిచి పెట్టాడని ఒక పురాణ కథనం ప్రచారంలో ఉంది. స్థానికంగా పత్రికల వారికి అందిన సమాచారం ఇలా ఉంది. శ్రీనగర్‌లోని ఒక హోటల్ యజమాని షోకెట్ అహ్మద్ మాట్లాడుతూ, దాడి జరిగినప్పటి నుంచి బుకింగ్‌లు జరగలేదని, మొత్తం 26 గదులు ఖాళీగా ఉన్నాయని నివేదించారు. అతను ముందస్తు చెల్లింపులను తిరిగి చెల్లించారు. ఆర్థిక పరిమితుల కారణంగా తన 15 మంది సిబ్బందిలో ముగ్గురిని మాత్రమే కొనసాగిస్తున్నారు. షోకెట్‌కు సుమారు రూ. 10 లక్షల మేర నష్టాలు సంభవించగా, ఇంకా కొనసాగుతున్న ఖర్చులు ఉన్నాయి. కానీ, ఆదాయం మా త్రం లేదు. బారాముల జిల్లాలోని పల్హల్లన్ గ్రామానికి చెందిన వలస కార్మికుడు, శ్రీనగర్‌కు చెందిన జకురాలోని ఒక హోట ల్లో మాజీ హౌస్‌కీపర్ అయిన ఇర్ఫాన్ లోన్ దాడి తర్వాత కొద్దిసేపటికే తన ఉద్యోగాన్ని కోల్పోయాడు. "నేను నిస్సహాయుణ్నయ్యాను" అని బాధతో అన్నాడుశ్రీనగర్‌లోని ఖన్యార్లోని ఒక హోటల్లో వె యిటర్‌గా పనిచేస్తున్న ఇంతియాజ్ ఆహ్, ఆ ప్రాంతంలో పర్యాటకులు తగ్గుముఖం పట్టడంతో తన ఉద్యోగాన్ని ఎలా వదిలివేయమని అడిగారో చెప్పుకొచ్చాడు. తన కుటుంబంలో ఏకైక జీవనాధారమైన ఇంతియాజ్ ఈ సవాలుతో కూడిన సమయంలో వారికి ఆహారం అందించడానికి పడరాని కష్టాలు పడుతున్నాడు. పర్యాటక పరంగా సమస్యలను ఎదుర్కొంటున్నది ఒక్క హోటల్ కార్మికులు మాత్రమే కాదు. సోనామార్గ్‌కు చెందిన మహ్మద్ ఆరిఫ్ పర్యాటకుల కోసం గుర్రపు స్వారీలు నిర్వహిస్తాడు. "నేను సాధారణంగా పర్యాటకులను గుర్రంపై పచ్చిక బయళ్ల గుండా తీసుకెళుతుంటా ను. దీనిద్వారా రోజుకు 2,000 రూపాయలు సంపాదిస్తాను. కానీ, ఇప్పుడు నాకు చేసుకోవడానికి ఆ పని లేదు. ఇంట్లోనే ఖాళీగా కూర్చోవాల్సి వస్తున్నది" అని అతను వాపోయాడు. శ్రీనగర్‌లోని మొఘల్ గార్డెన్స్‌కు దారితీసే బౌలేవార్డ్ రోడ్డులో వీధి వ్యాపారి అయిన షానవాజ్, దాల్ సరస్సు దగ్గర కస్టమర్ల కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. "నేను ఇక్కడ గత 10 సంవత్సరాలుగా ఫలూడా ఐస్ క్రీం అమ్ముతున్నాను. ఇలాంటి పరిస్థితిని ఎప్పుడూ చూడలేదు. గతంలో రోజుకు సుమారు 3,000 రూపాయలు సంపాదించే వాడిని, ఇప్పుడు 500 రూపాయ లు మాత్రమే సంపాదిస్తున్నాను. పాఠశాల ఫీజులు, నా పిల్లలకు ట్యూషన్స్ ఫీజులు సహా ఇంటి ఖర్చులను నిర్వహించడం కష్టంగా ఉంది.

# పార్టీల్లో కోవర్టుల కలకలం...

హైదరాబాద్, జూన్ 9, రాజకీయాల్లో గెలవాలన్నా.. గెలిచి నిలవాలన్నా? ఎత్తులకు పైఎత్తులు వేయడం వచ్చుండాలి. తమ బలాన్ని నమ్ముకోవడం ఒకెత్తయితే.. ఎదుటివారి బలహీనతల్ని పసిగట్టడం, అవతలివైపు లోగుట్టును ఎప్పటికప్పుడు తెలుసుకోవడం.. మరో బలమైన ఎత్తు. సమకాలీన రాజకీయాల్లో.. అన్ని రాజకీయ పార్టీలూ ఇప్పుడ రెండో ఎత్తుగడమీదే ఎక్కువ ఆధారపడుతున్నట్టు కనిపిస్తోంది. గల్లీ నుంచి ఢిల్లీ పాలిటిక్స్ వరకు.. ప్రధాన పార్టీలను కలవరపెడుతున్న అంశం కూడా అదే. ఇంతకీ, ఆ ముచ్చటేంటి? ఆ కలవరానికి కారణమేంటితెలుగు రాజకీయాల్లో.. ఇప్పుడు ఇలాంటి చర్చే జరుగుతోంది. ఏ పార్టీలో ఎవరి కోవర్టులు ఉన్నారో తెలియని గందరగోళ పరిస్థితులు నెలకొనడమే దీనికి ప్రధానంగా కారణంగా తెలుస్తోంది. చిన్నచితక నాయకులు మాట్లాడేదైతే మరేమంత సీరియస్ ఇష్యూగా పరిగణించాల్సిన అవసరం ఉండేది కాదేమో. రాహుల్ గాంధీ నుంచి.. చంద్రబాబు, కేటీఆర్‌లవరకు? బడానేతలు ఈ విషయాన్ని నొక్కి వక్కాణించడమే ఈ స్థాయి చర్చకు దారితీస్తోంది. చర్చకు సంగతి పక్కనపెడితే.. ప్రాంతీయ పార్టీ నుంచి జాతీయ పార్టీల వరకు? ప్రతిఒక్క పక్షాన్ని కోవర్టుల సమస్య ఇబ్బంది పెడుతోందనేది మాత్రం స్పష్టమవుతోంది. అయితే, ఏ పార్టీలో ఎవరికెవరు కోవర్టులుగా పనిచేస్తున్నారని తెలుసుకోవడమే ఇప్పుడు సవాలుగా మారింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు? పార్టీలో కోవర్టులపై ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. హత్యా రాజకీయాల్లో తలపండిన వైసీపీ నాయకులు కొందరు కోవర్టుల్ని తెదేపాలోకి పంపి వారి ఎజెండాను నెరవేర్చుకోవాలని అనుకుంటున్నారంటూ బాంబు పేల్చారు. సంతనూతలపాడులో టీడీపీ నేత వీరయ్య చౌదరి, మాచర్లలో మరో ఇద్దరు కార్యకర్తల హత్యలతో.. తనకు అదే అనుమానం కలుగుతోందన్నారు చంద్రబాబు. అలాంటివారిని ఉపేక్షిస్తే మన వేలితో మన కన్ను పొడుచుకున్నట్టేనంటూ.. కార్యకర్తల్ని హెచ్చరించారు. పదేళ్ల పాటు అధికారం చెలాయించిన బీఆర్ఎస్‌ను కూడా ఇప్పుడు కోవర్టుల భయం వెంటాడుతోంది. ఇటీవల కేసీఆర్‌కు కవిత రాసిన అంతర్గత లేఖ.. బయటకు లీకవడంతోనే కోవర్టుల ముచ్చట తెరమీదకు వచ్చింది. అంతర్గత విషయం బయటకెలా వచ్చిందో తేల్చాలని కవిత డిమాండ్ చేయగా ? పార్టీలో సీఎం రేవంత్రెడ్డి కోవర్టులు ఉన్నారంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. టైమొచ్చినప్పుడు ఆ కోవర్టులు వాళ్లంతట వాళ్లే బయటపడ్తారంటూ? ఇండైరెక్టుగా గట్టి వార్నింగే ఇచ్చారు. ఆలోపు ఇంకెన్ని బీఆర్ఎస్ సీక్రెట్స్ బయటకు వస్తాయో తెలియదు. కేటీఆర్ చెప్పిన దాంట్లో వాస్తవం లేకపోలేదు. ప్రతీ పార్టీలోనూ కోవర్టులు ఉంటారు. అక్కడి అంతర్గత విషయాలను.. తమ బాసులకు చేరవేస్తుంటారు. అయితే, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో సైతం.. బీఆర్ఎస్‌కు, బీజేపీకి కోవర్టులుగా పనిచేస్తున్నవారు ఉన్నారనే ప్రచారం చాలారోజులుగానే ఉంది. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండగా? వరంగల్ సభలో ఏకంగా రాహుల్‌గాంధీ ఈ విషయాన్ని ప్రస్తావించారు. అలాంటి వారు ఎవరైనా, ఎంతవారైనా తమకు అక్కర్లేదనీ.. బీజేపీలోనో, బీఆర్ఎస్‌లోనో చేరిపోవాలంటూ? తేల్చి చెప్పేశారు. కోవర్టులతో చాన్నాళ్లుగా ఇబ్బందపడిన కాంగ్రెస్ పార్టీకి? ఇప్పటికీ ఆ బెడద పోలేదని తెలుస్తోంది. జాతీయ స్థాయిలోనూ ఆ పార్టీకి కోవర్టుల సమస్య వెంటాడుతోంది. ఇటీవల గుజరాత్‌లో జరిగిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలోనూ రాహుల్ ఇదే విషయాన్ని ఉటంకించారు. కాంగ్రెస్‌లో సగంమందికిపైగా బీజేపీకి కోవర్టులుగా పనిచేస్తున్నారంటూ? తీవ్రవ్యాఖ్యలు చేశారు. వారివల్లే పార్టీ నష్టపోతోందని చెప్పారు. చంద్రబాబైనా, కేటీఆరైనా, రాహుల్ గాంధీ అయినా.. ఎవరు చెప్పినా కోవర్టుల ముచ్చట కొత్తదేం కాదు. మరీ ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో కోవర్టు సంస్కృతి ఎప్పటి నుంచో ఉందంటారు రాజకీయ విశ్లేషకులు. అధికారంలో లేనప్పుడు కాంగ్రెస్ నేతలు తమ పనులకోసం అధికారపక్షంతో అంటకాగిన సందర్భాలు చాలానే ఉన్నాయనే ప్రచారం ఉంది. తెలంగాణలో కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు? చాలామంది కాంగ్రెస్ నేతలు ఇలాంటి ఆరోపణలే ఎదుర్కొన్నారు. జగ్గారెడ్డి, కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా భట్టి విక్రమార్క వరకు.. అందరూ ఈ ఆరోపణలు ఎదుర్కొన్నవారే. గతంలోనూ ఇలాంటి రాజకీయాలు చేసిన నేతలు.. కాంగ్రెస్‌లో సొంతనేతలను ఓడించుకున్న పరిస్థితులు ఉన్నాయ్. కాళేశ్వరం కమిషన్ ముందు హాజరైన బీజేపీ ఎంపీ ఈటల విషయంలో.. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు తిప్పికొడుతున్న బీజేపీ? అసలు కోవర్టులు కాంగ్రెస్‌లోనే ఉన్నారనీ, వారంతా బీఆర్ఎస్ కోసం పనిచేస్తున్నారనీ ప్రతివిమర్శలు చేస్తోంది. పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ , కేసీఆర్‌కు అనుకూలంగా కోవర్టు రాజకీయాలు చేస్తున్నారంటూ.. బీజేఎల్పీ లీడర్ మహేష్‌గౌడ్ ఆరోపించారు. 2014 లోకసభ ఎన్నికల్లో పరోక్షంగా అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థి కవితకు మద్దతునిచ్చారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా? ప్రధాన రాజకీయ పార్టీలను ఇప్పుడు కోవర్టుల అంశం కుదిపేస్తోంది. ఈ సమస్యంతో అప్పట్లో అతలాకుతలమైన హస్తం పార్టీ అధికారం దక్కించుకోగా, ఇప్పుడు బీఆర్ఎస్‌ను ఆ సమస్య వెంటాడుతున్నట్టు తెలుస్తోంది. మరి, ఏ పార్టీకి ఎవరు కోవర్టులున్నారు? ఎంతమంది ఉన్నారు? వాళ్లెవరు? అనే విషయం ఎలా బయటకొస్తుందో? ఎప్పుడు బయటపడుతుందో చూడాలి.

## మిడిల్ క్లాస్ ఇంటిని మర్చిపోవడమేనా...

హైదరాబాద్, జూన్ 9, హైదరాబాద్లో పెరుగుతున్న రియల్ ఎస్టేట్ ధరలు యువ టెక్కీలకు చుక్కలు చూపిస్తున్నాయి. కొంతమంది సొంత ఇల్లు లేని కారణంగా వివాహాలు కూడా చేసుకోలేకపోతున్నామని బాధపడుతున్నారు. ఇంకొందరు ఇల్లు కొనడం కన్నా ప్లాట్ కొనుక్కోవడం బెటర్ అంటున్నారు. ఒకప్పుడు భారతదేశంలోని మధ్యతరగతికి అఫోర్డబుల్ హౌసింగ్గా గుర్తింపు పొందిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు బాగా సంపాదిస్తున్న టెక్ నిపుణులకు కూడా దడదడలాడిస్తోంది! ఆకాశాన్ని అంటుతున్న ప్రాపర్టీ ధరలు, పెరుగుతున్న కుటుంబ బాధ్యతలు, ఇంటిని సొంతం చేసుకోవాలనే తీవ్రమైన సామాజిక ఒత్తిడి, ముఖ్యంగా వివాహ సంబంధాలను మెరుగుపరచుకోవాలన్న ఉద్దేశాల మధ్య చాలా మంది యువకులకు ఇప్పుడు పరిమిత ఆప్షన్స్ మాత్రమే ఉంటున్నాయి. ఇది అందరిని ఇబ్బందిపెడుతోంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్లో అందుబాటులో ఉన్న గృహాల ఇన్వెంటరీకి, మధ్య ఆదాయ కొనుగోలుదారులు వాస్తవంగా కొనుగోలు చేయగలవాటికి మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉండటాన్ని తాజా పరిస్థితులు సూచిస్తున్నాయి. హైటెక్ సిటీకి 40 నిమిషాల దూరంలో ఉన్న బ్రాండెడ్ కాని అపార్ట్‌మెంట్ల ధరలు కూడా ఇప్పుడు రూ. 1.2-1.5 కోట్లు పలుకుతున్నాయి. ధరలు ఈ స్థాయిలో ఉండటంతో ఇంటిని సొంతం చేసుకోవడం అనేది కేవలం భరించలేని విధంగా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కొంతమందికి, ప్రాపర్టీని సొంతం చేసుకోవాలనే ఒత్తిడి వ్యక్తిగత పరిణామాలను కలిగి ఉంది. తనకు ఇల్లు లేనందున పెళ్లి సంబంధాలు పోతున్నాయని ఒక వ్యక్తి అంగీకరించారు. భారతీయ వివాహ సంస్కృతిలో సొంతిల్లు ఉండటం అనేది ఒక ముందస్తు అవసరంగా ఎలా మారుతుందో ఇది స్పష్టంగా ప్రతిబింబిస్తుందికొంతమంది యువ కొనుగోలుదారులు ఇప్పుడు ప్లాట్ పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇవి సాపేక్షంగా సరసమైనవి, వారికి నచ్చిన విధంగా ఇళ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పిస్తాయిహైదరాబాద్‌లోని ఒక ప్రొడక్ట్ ఆధారిత కంపెనీలో పనిచేస్తున్న 28 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. సంవత్సరానికి రూ. 29 లక్షల వార్షిక ప్యాకేజీ ఉన్నప్పటికీ, ఇంటిని సొంతం చేసుకోవడం తనకు ఎలా కష్టంగా మారిందో వివరించాడు. పరిశ్రమ ప్రమాణాల ప్రకారం గౌరవనీయమైన ఆదాయం ఉన్నప్పటికీ, అతను నగరంలో ఇంటిని కొనుగోలు చేయలేకపోతున్నాడట.''మా కుటుంబం 20 సంవత్సరాల క్రితం విడిపోయినప్పటి నుంచి నేనే కుటుంబ పోషణ భారాన్ని మోస్తున్నాను. నా ఆదాయంలో దాదాపు సగం నా తోబుట్టువుల చదువుకు, ఇతర ఇంటి ఖర్చులకు వెళుతోంది," అని అతను చెప్పడు. అతని తమ్ముడు, చెల్లి ఇంకా కాలేజీలో ఉండటం, వివిధ బీమా, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు భరించాల్సి ఉండటంతో పొదుపు లేదా ఇంటి పెట్టుబడి కోసం అందుబాటులో ఉన్న ఆదాయం తక్కువగానే ఉంది.

'అపార్ట్‌మెంట్ కొనే బదులు ప్లాట్ కొంటాను'

సరసమైన గృహనిర్మాణ ఆప్షన్స్ను వెతుకుతున్నప్పుడు ఏదో ఒక సమస్య వస్తోందని సామాజిక మాధ్యమం రెడ్డిట్లో యువ టెకీలు చెబుతున్నారు. హైదరాబాద్‌కు దాదాపు 100 కి.మీ దూరంలో ఉన్న తన స్వగ్రామంలో కూడా, 1,200 చదరపు అడుగుల సాధారణ ఇంటి ధర దాదాపు రూ. 75 లక్షలు ఉందని ఓ వ్యక్తి చెప్పాడు."ఇది నిరాశ కలిగిస్తోంది," అని అతను అన్నాడు. "ఆ మొత్తానికి, నేను ఒక ప్లాట్ కొని సొంతంగా ఇల్లు కట్టుకుంటాను. కనీసం అప్పుడైనా నాకు భూమి ఉంటుంది, అది కాలక్రమేణా విలువ పెరిగే అవకాశం ఉంది," అని వివరించాడు. అపార్ట్‌మెంట్లలో పెట్టుబడుల గురించి అతను సందేహం వ్యక్తం చేశాడు. దీర్ఘకాలిక విలువ తగ్గింపును ఉటంకిస్తూ.. "నార్సింగి వంటి ప్రాంతాల్లో 10 ఏళ్ల అపార్ట్‌మెంట్‌లు ఎలా ఉంటాయో నేను చూశాను, గోడలపై పగుళ్లు, నీటి లీకేజీలు సాధారణం. నిర్మాణ నాణ్యత నిలబడదు. మీ మొత్తం పొదుపులు బిల్డర్‌కు వెళతాయి. అది పెట్టుబడి కాదు, అదొక బాధ్యత," అని పేర్కొన్నాడు. ప్రస్తుతానికి, కొనుగోలుదారులు భూమిని కొనుగోలు చేయడం వైపు మొగ్గు చూపుతున్నారు. అది నగరం నుంచి మరింత దూరంగా వెళ్లవలసి వచ్చినా సరే! "నేను రూ. 70 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తే, నేను ఒక భూమిని కొని నాకు నచ్చిన విధంగా నిర్మించుకుంటాను. నాకు వంశపారంపర్య ఆస్తి లేదా ఆర్థిక వనరులు లేవు. భవిష్యత్తు కోసం ఏదైనా నిర్మించుకోవడానికి ఇది ఏకైక అవకాశం అనిపిస్తుంది,'' మరో వ్యక్తి చెప్పుకొచ్చాడు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ తాజా పరిస్థితితో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లను బుక్ చేసుకోండని నెటిజన్లు అంటున్నారు. టైర్-1 బిల్డర్‌తో నిర్మాణంలో ఉన్న ఫ్లాట్‌ను బుక్ చేసుకోవాలని, ఆర్థిక స్థిరత్వాన్ని సూచించడానికి దానిని ఉపయోగించుకోవాలని, పెళ్లి చేసుకోవాలని, ఆపై అపార్ట్‌మెంట్‌ను విక్రయించి డబ్బును తిరిగి పొందాలని నెటిజన్లు సూచిస్తున్నారు."నిర్మాణంలో ఉన్నంత వరకు మీరు రిజిస్ట్రేషన్ ఖర్చులను ఆదా చేసుకుంటారు. ఏకైక ప్రతికూలత.. పాక్షిక పంపిణీపై వడ్డీ. కానీ మీరు 20:80 చెల్లింపు ప్రణాళికను కనుగొంటే, మీరు ఆ 20% డౌన్ పేమెంట్‌ను ఏర్పాటు చేయగలిగితే అది కూడా తప్పించుకోవచ్చు, ఇది కష్టమే కానీ సాధ్యం చేసుకోవచ్చు," అని ఒక నెటిజన్ సలహా ఇచ్చాడు.

## మొదలైన బుజ్జగింపుల పర్వం

హైదరాబాద్, జూన్ 9, మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ నేతలను పార్టీ నాయకత్వం బుజ్జగించే కార్యక్రమాన్ని చేపట్టింది. మంత్రి వర్గ విస్తరణలో పదవులు రాని వారి ఇళ్లకు వెళ్లి స్వయంగా వారితో మాట్లాడుతున్నారు. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఇంటికి పీసీసీచీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్రవ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ లు చేరుకున్నారు. ఈ దఫా విస్తరణలో సుదర్శన్ రెడ్డికి చోటు దక్కలేదు. సుదర్శన్ రెడ్డి ఇంటికి... దీంతో ఆయనను బుజ్జగించేందుకు సుదర్శన్ రెడ్డి ఇంటికి చేరుకుని నేతలు బుజ్జగిస్తున్నారు. విస్తరణలో తనకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని సుదర్శన్ రెడ్డి కోరుతున్నారు. పార్టీలో సీనియారిటీతో పాటు సిన్సియారిటీ, నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం లేకపోవడంతో తనకు అవకాశం కల్పించాలన్నసుదర్శన్ రెడ్డి పేరును పరిశీలనలోకి తీసుకోలేదు. రెడ్డి సామాజికవర్గానికే ఈ విస్తరణలో చోటు దక్కలేదు. దీంతో ఆయనకు నచ్చ చెప్పేందుకు అగ్రనేతలు సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లారు. తర్వాత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో కూడా వీరిద్దరూ భేటీ కానున్నారని తెలిసిందిమూడు సామాజిక వర్గాలకు.. మంత్రి వర్గ విస్తరణ జరిగింది. ముగ్గురికి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ ముగ్గురి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కింది. ఇద్దరు ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారికి, ఒక బీసీ సామాజికవర్గానికి చెందిన నేతకు మంత్రివర్గంలో చోటు దక్కింది. వీరిలో గడ్డం వివేక్ మాల సామాజికవర్గానికి చెందిన వారు కాగా, అడ్లూరి లక్ష్మణ్ మాదిగ సామాజికవర్గానికి చెందిన వారు. ఇక వెనకబడిన తరగతులకు చెందిన అడ్లూరి లక్ష్మణ్ ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వారు. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కొత్త మంత్రులకు సంబంధించిన కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. గడ్డం వివేక్ ఇంగ్లీష్ లోనూ, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలు తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు.

## స్పోర్ట్స్ స్కూల్ అడ్మిషన్లకు లైన్ క్లియర్

అదిలాబాద్, జూన్ 9, తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ స్కూల్స్ కోసం ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. విద్యార్థులను చిన్నప్పటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచి.. క్రీడలలో శిక్షణ అందించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా పాఠశాలలను నిర్వహిస్తోంది. అయితే ఇందులో అడ్మిషన్ కోసం చాలా మంది వెయిట్ చేస్తూ ఉంటారు. ఇప్పుడు టైమ్ వచ్చింది. తెలంగాణ క్రీడా పాఠశాలల్లో నాలుగో తరగతి ప్రవేశానికి సంబంధించిన ప్రవేశాల ప్రక్రియ షురూ అయింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి ఎంపిక ప్రక్రియ జరగనుంది. సీట్ల వివరాలుహకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల కోసం ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. హకీంపేట్ బాలురు-20 సీట్లు, బాలికలు-20 సీట్లు. కరీంనగర్ బాలురు-20 సీట్లు, బాలికలు-20 సీట్లు, ఆదిలాబాద్ బాలురు-20 సీట్లు, బాలికలు-20 సీట్లు ఉన్నాయి. అంటే మె?త్తం 120 సీట్లలో 60 బాలురకు, 60 బాలికలకు అన్నమాట. ఎంపిక ప్రక్రియ మూడు విధానాల్లో జరుగుతుందని గుర్తుంచుకోవాలి. 16-06-2025 నుంచి 19-06-2025 మధ్య మండల స్థాయి ఎంపిక జరుగుతుంది. 23-06-2025 నుంచి 26-06-2025 మధ్య జిల్లా స్థాయి సెలక్షన్ ఉంటుంది. 01-07-2025 నుంచి 05-07-2025 వరకు రాష్ట్ర స్థాయి ఎంపిక చేస్తారు. ఇందులో ఎంపికైన వారి మెరిట్ ఆధారంగా తీసుకుంటారు. ఫిజికల్ పరీక్షలు(27 మార్కులు)30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్స్, స్టాండింగ్ బాడీ జంప్, 800 మీటర్ల రన్, 6లీ10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఎత్తు, బరువు. ఈ పరీక్షలు చేస్తారు. ఇందులో ప్రతీదానికి 3 మార్కులు ఉంటాయి.

## తెలంగాణ బియ్యానికి బ్రాండింగ్...

హైదరాబాద్, జూన్ 9,తెలంగాణలో సన్న వడ్ల దిగుబడి అధికంగా ఉంది. దీంతో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. 'తెలంగాణ బ్రాండ్' పేరుతో నాణ్యమైన బియ్యాన్ని మార్కెట్లో విక్రయించాలని డిసైడ్ అయింది. బీపీటీ, ఆర్ఎన్ఆర్, జై శ్రీరాం వంటి రకాలు మిల్లింగ్ చేసి సొంత బ్రాండ్‌తో విక్రయించాలని యోచిస్తోంది. సూపర్ మార్కెట్లు, కిరాణా, రేషన్ షాపులలో కూడా వీటిని అందుబాటులో ఉంచనున్నారు. ఏపీఎల్ కార్డుదారులకు మార్కెట్ ధర కంటే కాస్త తక్కువకే ఈ బియ్యాన్ని విక్రయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తెలంగాణలో రాష్ట్ర అవసరాలకు మించి సన్న వడ్లు ఉత్పత్తి అవుతుండటంతో.. మిగులు ధాన్యాన్ని వినియోగించుకోవడానికి పౌరసరఫరాల సంస్థ వినూత్న ప్రణాళికతో ముందుకొచ్చింది. మిగులు ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి నాణ్యమైన బియ్యంగా 'తెలంగాణ బ్రాండ్' పేరుతో మార్కెట్లోకి విడుదల చేయాలని డిసైడ్ అయింది. ముఖ్యంగా బీపీటీ, ఆర్ఎన్ఆర్, జై శ్రీరాం వంటి అధిక డిమాండ్ ఉన్న సన్నబియ్యం రకాలను మిల్లింగ్ చేసి విక్రయించాలని డిసైడ్ అయ్యారు. ప్రస్తుతం ఈ రకం బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ప్రత్యేకంగా నిల్వ చేసింది. వానాకాలం, యాసంగి సీజన్లలో తెలంగాణలోని కొనుగోలు కేంద్రాలకు భారీ మొత్తంలో సన్నధాన్యం చేరింది. యాసంగి పంటతో పోలిస్తే వానాకాలం పంటలో నూకలు తక్కువగా వస్తాయి. దీంతో బియ్యం నాణ్యత మెరుగ్గా ఉంటుంది. ఈ కారణంగానే వానాకాలం వడ్లతో వచ్చిన బియ్యాన్నే 'తెలంగాణ బ్రాండ్' పేరుతో విక్రయించనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఇది రైతులకు మంచి మద్దతు ధర లభించడానికి, అధిక దిగుబడికి ప్రోత్సాహం అందిస్తుందని అధికారులు భావిస్తున్నారు. తెలంగాణ బ్రాండ్ బియ్యాన్ని కేవలం సూపర్‌మార్కెట్లు, కిరాణా దుకాణాల్లో మాత్రమే కాకుండా.. రాష్ట్రంలోని రేషన్ షాపుల్లోనూ విక్రయించనున్నారు. ప్రస్తుతం ఆహార భద్రత కార్డు (తెల్లకార్డు) ఉన్నవారికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారికి త్వరలో కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఈ ఏపీఎల్ కార్డుదారులు తమకు అవసరమైన 'తెలంగాణ బ్రాండ్' బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా మార్కెట్ ధరతో పోలిస్తే కాస్త తక్కువకే కొనుగోలు చేసేందుకు వీలు కల్పించనున్నారు. ఇది పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరలో పొందడానికి సహాయపడుతుందని అధికారులు భావిస్తున్నారు.'

# చైనాలో అందగాళ్లకు డిమాండ్

## కౌగలించుకుటంటే ఐదు నిమషాలకు రూ. 600

బీజింగ్, జూన్ 9, చైనాలో కొంత మంది యవతులు ఇప్పుడు ఆప్యాయంగా హగ్ చేసుకున్న వారికి డబ్బులు చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. ఒత్తిడి తగ్గించుకోవడానికి, భావోద్వేగాలను కంట్రోల్చేసుకోవడానికి మృదువైన స్వభావం ఉన్న పురుషులు నుండి ఐదు నిమిషాల కౌగిలింతల కోసం రూ. 600 చెల్లిస్తున్నారు. మృదువైన స్వభావం ఉన్న పురుషులను మాన్ మమ్స్ అని పిలుస్తున్నారు. చైనాలో యువతులు “మాన్ మమ్స్” అని పిలిచే పురుషుల నుండి ఐదు నిమిషాల కౌగిలింతల కోసం సుమారు 50 యువాన్ లు చెల్లించడానికి సిద్ధపడుతున్నరు. యాభై యువాన్లు మన దేశంలో ఆరు వందలతో సమానం. ఈ “మాన్ మమ్స్” అనే పదం గతంలో జిమ్‌లో కసరత్తు చేసే బలిష్టమైన పురుషులకు వాడేవారు. ఇప్పుడు సౌమ్యత , ఓపిక వంటి సాంప్రదాయ స్త్రీ లక్షణాలతో బలాన్ని మిళితం చేసే పురుషులను ఉద్దేశించి ఉపయోగిస్తున్నారు. ఈ కౌగిలింతలు చాట్ యాప్‌ల ద్వారా ఏర్పాటు చేసే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. సాధారణంగా మాల్స్ లేదా సబ్‌వే స్టేషన్‌ల వంటి బహిరంగ ప్రదేశాలలో ఈ కౌగిలింతలు ఉ ంటాయి. ఒత్తిడితో కూడిన సమయాల్లో భావోద్వేగ ఉపశమనం అందిస్తున్నాయని చైనా మహిళల చెబుతున్నారు. ఒత్తిడితో ఉన్న ఒక విద్యార్థిని తన థీసిస్ ఒత్తిడిని తట్టుకోవడానికి ఫిట్‌గా ఉన్న “మాన్ మమ్” నుండి కౌగిలింత కోసం చెల్లించాలని ఆన్‌లైన్‌లో పోస్ట్ చేసింది. “సెకండరీ స్కూల్‌లో ఒకసారి కౌగిలించుకున్నప్పుడు సురక్షితంగా భావించాను. మనం సబ్‌వే స్టేషన్‌లో ఐదు నిమిషాలు కౌగిలించుకోవచ్చు.” అని పోస్ట్ చేసింది. పోస్ట్ వైరల్ అయింది. అప్పటి నుంచి ఈ ట్రెండ్ ప్రారంభమయింది. . మహిళలు మర్యాద, ఓపిక, శారీరక రూపం, ఆకర్షణ ఆధారంగా “మాన్ మమ్స్”ను ఎంచుకుంటారు, సాధారణంగా ప్రైవేట్ చాట్‌ల ద్వారా మాట్లాడిన తర్వాత భేటీ అవుతారు. ఈ ట్రెండ్ ప్రధానంగా చైనా ప్రధాన నగరాల్లో కనిపిస్తోంది. కొందరు ఎత్తు, అథ్లెటిక్ శరీరం కలిగిన మహిళలను కూడా ఈ సేవల కోసం పరిగణనలోకి తీసుకుంటారని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తెలిపింది. ఎలాంటి అసభ్యత లేకుండా.. కేవలం ఆప్యాయంగా,ప్రేమగా కౌగలించుకోవాలనుకునేవారికే.. ఈ సర్వీస్ సంతృప్తికరంగా ఉంటుందని చెబుతున్నారు.

# బాధ్యతలు తీసుకున్న 24 గంటల్లోనే రాజీనామా

హైదరాబాద్, జూన్ 9, భారీ చిత్రాలకు కూడా పర్సంటేజ్ అనే విధానాన్ని తీసుకురావాలని ఎగ్జిబిటర్లు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీనికి నిర్మాతలు ఒప్పుకోవడం లేదు. ఈ పద్ధతిని గనక అమలు చేస్తే తాము తీవ్రంగా నష్టపోతామని వారు వాపోతున్నారు. ఈ వివాదం వల్ల సునీల్ నా రంగ్ తన పదవికి రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. తెలంగాణ ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన 24 గంటల్లోనే నారంగ్ ఈ నిర్ణయం తీసుకోవడం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. “ నాకు సంబంధం లేకపోయినా సింగిల్ థియేటర్స్ వివాదంలోకి నన్ను లాగుతున్నారు. అందువల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని” సునీల్ తన అంతరంగికుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఇటీవల బంద్ వార్తలు వచ్చిన నేపథ్యంలో.. దాని వెనుక ఆ నలుగురు ఉన్నారంటూ జరిగిన ప్రచారం కూడా సునీల్ ను కలతకు గురి చేసినట్టు తెలుస్తోంది. ఆ నలుగురిలో సునీల్ కూడా ఉన్నారని ప్రచారం జరిగింది. అది ఆయనను తీవ్రంగా బాధపెట్టిందని సమాచారం.. ఆ వ్యాఖ్యలపై దిల్ రాజు, అరవింద్ లాంటి వాళ్లు రోజుల వ్యవధిలో విలేకరుల ముందుకు వచ్చి తమ వాణి వినిపించినప్పటికీ.. సునీల్ మాత్రం సైలెంట్ అయ్యారు.. ఇక ఇటీవల చాంబర్ ఆఫ్ కామర్స్ కొత్త కార్యవర్గం విలేకరుల సమావేశం నిర్వహించింది. అందులో శ్రీధర్ అనే వ్యక్తి చేసిన వ్యాఖ్యలు సునీల్ ను తీవ్రంగా వేదనకు గురిచేసాయి.. పెద్ద హీరోలను లక్ష్యంగా చేసుకొని శ్రీధర్ ఆరోపణలు చేశారు. శ్రీధర్ చేసిన వ్యాఖ్యల వెనుక సునీల్ ఉన్నారని ప్రచారం జరిగింది. ఆ ప్రచారం అంతకంతకు పెరుగుతున్న నేపథ్యంలో ఏకంగా ఆయన రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని ఎగ్జిక్యూటివ్ కమిటీకి తెలియజేశారు.సునీల్ రాజీనామాకు కారణమైన వివాదం ఏపీలో మొదలైంది. జూన్ 1 నుంచి థియేటర్లను మూసివేస్తామని వార్తలు వచ్చాయి. చిన్న సినిమాలు తక్కువ కాదని.. పెద్ద సినిమాల మాదిరిగానే పర్సంటేజ్ ఇవ్వాలని ఎగ్జిబిటర్స్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ వల్ల సినీ పరిశ్రమ రెండు వర్గాలుగా విడిపోయింది. ఈ వివాదం నేపథ్యంలో సినిమా పరిశ్రమలో పనిచేసే పెద్దలు సమస్య పరిష్కారానికి కృషి చేయకుండా.. ఎవరికి వారుగా దూరం జరిగిపోయారు.. ఈ వివాదం ఏప్రిల్ 19న ఆంధ్రప్రదేశ్లోని తూర్పుగోదావరి జిల్లాలో మొదలైంది. తూర్పుగోదావరి జిల్లాలోని అనుశ్రీ ఫిలిమ్స్ అధినేత సత్యనారాయణ ఈస్ట్ గోదావరి జిల్లాలో డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ గా కొనసాగుతున్నారు. ఒక సందర్భంలో థియేటర్లను బంద్ చేయాల్సిన అవసరం ఉందని ఆయన తొలిసారిగా వ్యాఖ్యానించారు. అది కాస్త చినికి చినిగి గాలి వానలాగా మారింది. చివరికి నైజాం దాకా విస్తరించింది.. నైజాం ఏరియాకి గుండెకాయ లాంటి హైదరాబాదులో ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, ప్రొడ్యూసర్లు ను ఒక వేదిక బతుకు తీసుకొచ్చి చాంబర్ ఆఫ్ కామర్స్ అనేక సందర్భాల్లో చర్చలు జరిపింది.


అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది.. ఒకానొక దశలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్స్ మధ్య విపరీతమైన గొడవలు వచ్చాయి. దీని అందరికి కారణం పర్సంటేజ్, రెంట్ అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.ఎగ్జిబిటర్ల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని.. దానికోసం ఒక కమిటీని నియమిస్తామని చాంబర్ ఆఫ్ కామర్స్ కీలక ప్రకటన చేసింది. మే 24 లో సమావేశం నిర్వహించి చర్చలు కూడా జరిపింది.. ఇక ఇదే సమయంలో పవన్ కళ్యాణ్ కార్యాలయం నుంచి ఒక లేఖ వచ్చింది. దీంతో మే 25, మే 26న అల్లు అరవింద్, దిల్ రాజు వరుసగా విలేకరుల సమావేశాలు నిర్వహించి తమ వివరణ ఇచ్చుకున్నారు..” ఆ నలుగురిలో మాకు స్థానం లేదు. అసలు అందులో మేము లేము. పవన్ కళ్యాణ్ సినిమా ఎవరు అడ్డుకుంటారు. అడ్డుకునే స్థాయి ఎవరికి ఉంది” అని వారి వ్యాఖ్యానించారు.. అయితే థియేటర్ల నిర్వహణ వ్యయం అంతకంతకు పెరగడం.. ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోవడం.. ఓటీటీకి వెంటనే సినిమాలు వచ్చేయడం వల్ల తమకు నష్టం జరుగుతోందని థియేటర్లో ఓనర్లు చెబుతున్నారు. అయితే థియేటర్ ఓనర్ల సమస్యలు గాలికి వెళ్ళగా.. సినిమా పరిశ్రమలోని పెద్దలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఈ సమస్యలు 40 రోజులుగా సాగుతున్న వ్యవహారంలో తెరపైకి వచ్చినప్పటికీ.. పరిష్కార మార్గం మాత్రం కాన రాలేదు.. అప్పటికి దిల్ రాజు చెప్పినట్టుగానే.. ఫలు దఫాలుగా జరిగిన చర్చలు ఎటువంటి ఫలితం లేకుండానే అర్ధాంతరంగా ముగిసిపోవడం విశేషం.. థియేటర్ లలో ప్రేక్షకులు సినిమా చూపించేలాగా పరిస్థితులు కనిపించడం.. సినిమాల బడ్జెట్ ను నియంత్రణలో ఉంచడం వంటి చర్యలు తీసుకుంటేనే ఈ సమస్యలను పరిష్కరించడానికి సాధ్యమవుతుంది. లేకుంటే నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు జుట్లు జట్లు పట్టుకొని కొట్టుకునేదాకా వస్తుంది.

# రైతులకు 4 శాతం వడ్డీకే రూ. 3 లక్షల రుణం!

న్యూఢిల్లీ జూన్ 9,దేశంలోని రైతులకు మోడీ ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెడుతోంది. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు రకరకాల స్కీమ్‌లను అందుబాటులోకి తీసుకువస్తోంది. మోడీ సర్కార్ ముందుగా రైతులకు ప్రాముఖ్యతను ఇస్తుంది. ఈ నేపథ్యంలో దేశంలో లక్షలాది మంది రైతులు కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని ఉపయోగించుకుంటున్నారని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామ్ అన్నారు. ఈ పథకం ద్వారా రైతులు సకాలంలో తక్కువ వడ్డీ రేటుకే రుణ సౌకర్యాన్ని పొందుతున్నారని అన్నారు. దీనికి సంబంధించి వివరాలను ఎక్స్ వేదిక పోస్టు చేశారు. రైతులకు అందించే ఈ రుణాలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల వంటి వ్యవసాయ అవసరాలను తీర్చుకునేందుకు ఉపయోగపడుతున్నాయని అన్నారు.కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం రైతులకు బలమైన ఆర్థిక సహాయంగా మారిందని, ఇప్పటివరకు 465 లక్షల దరఖాస్తులు ఆమోదించినట్లు చెప్పారు. వీటి పరిమితి రూ.5.7 లక్షల కోట్లకు చేరుకుందని ఆమె అన్నారు. క్రెడిట్ కార్డుల ద్వారా స్వల్పకాలిక పంట రుణాలు ఇప్పుడు సులభతరం అయ్యాయి. కెసిసి ద్వారా, వ్యవసాయ కార్యకలాపాలకు వారి ఆర్థిక అవసరాలను తీర్చడానికి కేంద్ర ప్రభుత్వం రైతులకు రుణ రూపంలో రూ.5 లక్షల వరకు సహాయం చేస్తుంది.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కార్యాలయం నుండి విడుదల చేసిన పోస్ట్‌లో కిసాన్ క్రెడిట్ కార్డ్ (కెసిసి) ఇప్పుడు దేశంలోని లక్షలాది మంది రైతులకు ఆర్థిక జీవనాధారంగా మారిందని ఆర్థిక మంత్రి అన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటి ముఖ్యమైన వస్తువులను కొనుగోలు చేయడంలో, పంట ఉత్పత్తికి సంబంధించిన నగదు అవసరాలను తీర్చడంలో కెసిసి పథకం రైతులకు గొప్ప సౌలభ్యాన్ని అందించిందని ఆమె అన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా స్వల్పకాలిక పంట రుణాలు ఇప్పుడు సులభతరం అయ్యాయని ఆమె అన్నారు.రైతు సకాలంలో చెల్లిస్తే, రూ.3 లక్షల వరకు రుణంపై 4 శాతం వడ్డీ మాత్రమే చెల్లించాలి. దీనితో పాటు, రుణాన్ని సకాలంలో తిరిగి చెల్లించినందుకు 3 శాతం అదనపు సత్వర చెల్లింపు ప్రోత్సాహకం కూడా అందిస్తుంది. దీని కారణంగా రైతులు ప్రతి లక్ష రూపాయలపై ప్రతి సంవత్సరం దాదాపు రూ.9,000 వడ్డీని ఆదా చేయవచ్చు.ఇదిలా ఉండగా, ప్రభుత్వం ఇప్పుడు ఈ సబ్సిడీ రుణ పరిమితిని రూ.3 లక్షల నుండి రూ.5 లక్షలకు పెంచింది. దీని వలన రైతులకు మాత్రమే కాకుండా మత్స్యకారులు, పాడి రైతులకు కూడా ప్రయోజనం చేకూరింది. ఇప్పటివరకు 7.7 కోట్లకు పైగా రైతులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందినట్లు కేంద్రం తెలిపింది.2013లో వ్యవసాయ బడ్జెట్ కేవలం రూ.21,500 కోట్లు మాత్రమేనని, 2024 నాటికి దానిని రూ.1.22 లక్షల కోట్లకు పెంచామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

# విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించడానికి భారతదేశము నా మాతృభూమి అనే జాతీయ ప్రతిజ్ఞ రచించిన మహనీయుడు పైడిమర్రి వెంకటసుబ్బారావు

## -నేడు అయిన జయంతి



( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

భారతదేశంలోని విద్యార్థుల్లోనూ దేశభక్తిని పెంపొందించడానికి భారతదేశము నా మాతృభూమి అనే భారత జాతీయ ప్రతిజ్ఞ రచించిన రచయిత, బహుభాషావేత్త పైడిమర్రి వెంకటసుబ్బారావు. ఈయన 1916, జూన్ 10న పైడిమర్రి రాంబాయమ్మ, వెంకప్రూటామయ్య దంపతులకు నల్లగొండ కేంద్రానికి అతి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండలోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు.హైదరాబాద్ రాష్ట్రంలోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు.ఆయన 1962 లో విశాఖపట్నం ట్రెజరీ అధికారిగా ఉన్నపుడు ఈ ప్రతిజ్ఞ తయారు చేశాడు. భారత్-చైనా యుద్ధం జరుగుతున్న సమయమది. ఆ యుద్ధం పూర్తయిన తర్వాత చైనా ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. తమ దేశ ప్రజల్లో ప్రాథమిక దశ నుంచే దేశభక్తి భావం నూరిపోయాలని..! ఆ మేరకు ప్రత్యేకంగా కొన్ని దేశభక్తి గేయాలను రాయించి, పాఠశాల విద్యార్థులతో చదివించడం మొదలుపెట్టింది.అప్పటికే విదేశీ భాషల్లో ప్రావీణ్యం ఉన్న పైడిమర్రి ఈ విషయం గుర్తించాడు. మన దేశ విద్యార్థుల్లోనూ దేశభక్తిని పెంపొందించడానికి గేయాలుంటే బాగుంటుందని భావించాడు. పలు రచనలు చేసిన అనుభవంతో ఆ ఆలోచనకు రూపమివ్వడం మొదలుపెట్టాడు. ప్రతిజ్ఞకు పదాలు కూర్చాడు. విశాఖ సాహితీ మిత్రుడు తెన్నేటి విశ్వనాథంతో చర్చించాడు. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలము’ అన్న వాక్యాన్ని అదనంగా చేర్చాడు. అంతాబాగానే ఉంది కానీ, దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పాఠ్యపుస్తకాల్లో చేర్చడం ఎలా అని ఆలోచించారు.అది కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం. అప్పటి విద్యాశాఖ మంత్రి విజయనగరం రాజాగా పేరుగాంచిన పీవీజీ రాజు. ఆయన సాహితీవేత్త కావడం వారికి కలిసొచ్చింది. తేన్నేటి సాయంతో ప్రతిజ్ఞను పీవీజీ రాజు దృష్టికి తీసుకెళ్లాడు. దాని విలువను, అవసరాన్ని వివరించి ఓ ప్రతిని అందజేశారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయనిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహామండలి సమావేశం జరిపినపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించి 1965 జనవరి 26 నుంచి దేశమంతటా చదువుతున్నారు.పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలానుగుణంగా కొన్ని స్వల్ప మార్పులు మాత్రం జరిగాయి. గ్రాంథికంలో కొన్ని పదాల స్థానంలో వాడుక భాష వాడారు. ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి వచ్చింది.ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న ఆయన అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకటసుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కెసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 2015-16 విద్యాసంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్యపుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రభుత్వం 5వ తరగతి తెలుగు పుస్తకం అట్ట వెనుక భాగం లోపలి పేజీలో పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత చరిత్రను ముద్రించి విశేష ప్రాచుర్యం కల్పించి గౌరవించింది. ఆయన రచించిన భారత జాతీయ ప్రతిజ్ఞ మరోసారి మనము చదువుదాము...

..భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను .సుసంపన్నమైన, బహువిధమైన నాదేశ వారసత్వసంపద నాకు గర్వకారణం.దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను. నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్నీ గౌరవిస్తాను. ప్రతివారి తోను మర్యాదగా నడుచుకొంటాను. నా దేశం పట్ల, నా ప్రజల పట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

# 90 ఏళ్ల వయస్సులో ఒక్కటైన జంట

జైపూర్, జూన్ 9, ఇదో వింత ప్రేమ కహానీ.. 70 ఏళ్లుగా సహజీవనం చేస్తున్న జంటకు ఎట్టకేలకు ఊరంతా కలిసి పెళ్లి చేశారు. ఘనంగా ఊరేగింపు, బరాత్ జరిపి 90 ఏళ్ల వధువుకు 95 ఏళ్ల వరుడికి పెళ్లి తంతు నిర్వహించారు. ఈ విచిత్ర ఘటన రాజస్థాన్‌లోని దుంగార్పూర్ జిల్లా గలందర్ గ్రామంలో చోటు చేసుకుంది. వీరి వివాహ వేడుకల వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకెళ్తే..రాజస్థాన్‌లోని దుంగార్‌పూర్ జిల్లా గలందర్ అనే గిరిజన గ్రామంలో గత 70 ఏళ్లుగా సహజీవనం చేస్తున్న వృద్ధ దంపతులకు ఎట్టకేలకు ఇప్పుడు పెళ్లి జరిగింది. వీరికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మనవలు ఉన్నారు. వీరందరి సమక్షంలో జీవాలి దేవి (90) మెడలో రమాభాయ్ అంగారి (95) మూడు ముళ్లు వేసి ముసిముసిగా నవ్వుతూ సిగ్గులొలకబోశారు. అధికారికంగా వివాహం జరగనప్పటికీ ఈ జంట ఆరుగురు సంతానంకి జన్మ ఇచ్చారు. ఇందులో నలుగురు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. వృద్ధ జంట పెద్ద కుమారుడికి 60 ఏళ్లు. వీరి పిల్లలకు కూడా వివాహాలు జరిగి కుటుంబాలుగా ఏర్పడ్డారు. దాదాపు జీవిత చరమాంకంలో ఏడు దశాబ్దాల అనంతరం పెళ్లిముచ్చట తీర్చుకోవాలని ఆశపడిన ఈ జంట తమ కుమారులకు విషయం చెప్పారు.గ్రామపెద్దలు, కుటుంబసభ్యులు అందరూ కలిసి జూన్ 1న హల్దీ వేడుకతో పెళ్లి సంబరాలు మొదలు పెట్టి జూన్ 4వ తేదీన ఇద్దరికీ పెళ్లి చేసి డీజే పాటలు, నృత్యాలతో ఊరంతా ఊరేగించారు.

# త్వరలో టన్నెల్ పనులు

మహబూబ్ నగర్, జూన్ 9, శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ ప్రమాదం సంభవించి దాదాపు నాలుగు నెలలు కావస్తుంది. అయితే రెస్క్యూ ఆపరేషన్ ను ప్రభుత్వం నిలిపి వేసింది. శ్రీశైలం ఎడమ గట్టు సొరంగంలో రెస్క్యూ ఆపరేషన్ కు బ్రేక్ పడింది.మరో మూడు నెలల వరకూ ప్రమాదం జరిగిన ప్రాంతంలో తవ్వకాలు జరిపే అవకాశం లేదని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాలకు కనీసం మృతదేహాలను కూడా అప్పగించలేని పరిస్థితి తలెత్తింది. ఇప్పటికే శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ ప్రమాదం వంద రోజులు దాటిపోయింది. శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ ప్రమాదం లో రెస్క్యూ ఆపరేషన్ కు తాత్కాలిక బ్రేక్ అని చెప్పినప్పటికీ ఇక కొనసాగించే అవకాశాలు మాత్రం కనిపించడం లేదు.మొత్తం ఎనిమిది మంది కార్మికులు శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ లో జరిగిన ప్రమాదంలో చనిపోగా అందులో ఇద్దరి మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. మరో ఆరుగురి మృతదేహాలు లభ్యం సాధ్యం కాలేదు. ప్రమాదకరమైన ప్రాంతంలో మృతదేహాలుంటాయని గుర్తించినప్పటికీ అక్కడకు సహాయక బృందాలకు వెళ్లలేక చేతులెత్తేశాయి. దాదాపు మూడు నెలల పాటు నిర్విరామంగా పనిచేసిన సహాయక బృందాలు ఆ తర్వాత తమ వల్ల కాదని చెప్పేశాయి. అందులో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా కూడా ఇక మృతదేహాల గాలింపు సాధ్యం కాదని తేల్చి చెప్పడంతో ప్రభుత్వం కూడా దీనిపై నిర్ణయం తీసుకుంది. ఈ ప్రమాదంలో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ఉన్నతాధికారి శివశంకర్ ను నియమించినా ఆయన ఇచ్చిన నివేదిక కూడా అలాగే ఉంది.. ప్రమాదం జరిగిన డీ2 ప్రాంతంలో తవ్వకాలు జరిపితే పై కప్పు మళ్లీ కూలుతుందని అధికారులు చెప్పడంతో ఆ ప్రయత్నం విరమించుకున్నారు. ప్రమాదకరమైన జోన్ లో తవ్వకాలు జరపడం మంచిది కాదని, సేఫ్ కూడా కాదని, కార్మికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని హెచ్చరికలతో నెలరోజులకు పైగానే అక్కడ సహాయక చర్యలు కొనసాగడం లేదు.దీంతో మృతదేహాలను మాత్రం కుటుంబీకులకు అప్పగించలేకపోయారు. కేవలం ఇద్దరిని మాత్రమే అప్పగించారు. అయితే ఇప్పుడు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేసిన ప్రకటన మరోసారి చర్చనీయాంశమైంది. మరోసారి శ్రీశైలం ఎడమ కాల్వ టన్నెల్ పనులు ప్రారంభిస్తామని, ఈ ఏడాది శాసనసభ సమావేశాల్లోపు వాటిని పూర్తి చేస్తామని, అందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తామని చెప్పడంతో మృతదేహాలను వెలికి తీయడంలో బ్రేక్ ఇచ్చిన ప్రభుత్వం మరోసారి ప్రారంభిస్తుందా? లేక టన్నెల్ పనులను అలాగే మొదలు పెడుతుందా? అన్నది తేలాల్సి ఉంది

# ప్రమాద నివారణకు సహకరించాలి.

## రామగుండం ట్రాఫిక్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్.

గోదావరిఖని :రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని రామగుండం ట్రాఫిక్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇటీవల ట్రాఫిక్ ఏసిపి గా నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరము ఆయన ఏసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో రోడ్ల పైన, నగరంలోని ప్రధాన వీధుల్లో వాహనాలధాలు తమ వాహనాలను నిలిపి ట్రాఫిక్ అంతరాయంతో రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్నాయని ఆయన తెలిపారు.

# ఆశను నిరాశ చేసితివా..

హైదరాబాద్, జూన్ 9, సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి దక్కలేదు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అమాత్య స్థానం లభించలేదు. రాములమ్మకు మంత్రదండం సాధ్యం కాలేదు. మొత్తంగా అధిష్టానం ఎవరినైతే ఫిక్స్ చేసిందో వారికి మాత్రమే పదవులు వచ్చాయి. పదవుల మీద ఆశలు పెట్టుకున్న వారికి రిక్త హస్తాలే మిగిలాయి.కాంగ్రెస్ పార్టీలో సిఫారసు రాజకీయాలకు కొదవ ఉండదు. గ్రూపు రాజకీయాలకు అడ్డు ఉండదు. అలాంటి చోట కేబినెట్ విస్తరణలో ఆశావాహులకు కాకుండా పైరవీకారులకు పదవులు లభిస్తాయని అంచనా ఉన్నది. మీడియాకు కొన్ని పేర్లు లీక్ చేసినప్పటికీ.. వారికి పదవులు లభిస్తాయనే స్పష్టత లేదు.. వాస్తవానికి కేబినెట్ విస్తరణ జరుగుతుందని ఎప్పటి నుంచో ప్రచారం మొదలైంది. దీనిపై అనేక సందర్భాలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తినకు వెళ్లి వచ్చారు. పార్టీ పెద్దలను కలిశారు. కొన్నిసార్లు ఆయన ఒక్కరు మాత్రమే వెళ్లారు. ఇక అనేక సందర్భాలలో భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, మహేష్ కుమార్ గౌడ్ వంటి వారు వెళ్లారు. ఇలా అనేక సందర్భాల్లో ముఖ్యమంత్రి హస్తిన వెళ్లిన తర్వాత చివరికి.. మంత్రివర్గం విస్తరణ పై ఒక క్లారిటీ వచ్చిందిశ్రీహరి ముదిరాజ్, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కు మంత్రి పదవులు లభించాయి. బిసి, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన నాయకులకు మంత్రి పదవులు ఇవ్వాలని అధిష్టానం పట్టుదలతో ఉండడంతో.. సిఫారసులకు లెక్కలేకుండా పోయింది. వాస్తవానికి మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, విజయశాంతికి అవకాశం లభిస్తుందని ప్రచారం జరిగింది. ఎందుకంటే సుదర్శన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా ఉన్నారు. రాజగోపాల్ రెడ్డికి కే సి వేణుగోపాల్ రెడ్డి నుంచి అండదండలు ఉన్నాయి. విజయశాంతికి ఏసిసి అధ్యక్షుడి ఆశీర్వాదాలు ఉ న్నాయి. ఇన్ని ఉన్నప్పటికీ కూడా ఈ ముగ్గురికి పదవులు రాకపోవడం విశేషం. వీరు ముగ్గురు కూడా మంత్రి పదవులపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. వీరు మాత్రమే కాదు అద్దంకి దయాకర్ కూడా మంత్రి అవతారని ప్రచారం జరిగింది. అద్దంకి దయాకర్ అనుచరులు సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం కూడా చేశారు. కాని చివరికి అధిష్టానం తాము అనుకున్న వారికి మాత్రమే పదవులు ఇచ్చింది. అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో స్థానిక నాయకత్వం.. ఆ ముగ్గురికి మాత్రమే మంత్రి పదవులు ఇచ్చినట్టు పేర్కొంది. ఇక డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ కు డిప్యూటీ స్పీకర్ పదవి రావడం విశేషం. ఆయన తొలిసారిగా డోర్నకల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ముఖ్యమంత్రి దగ్గర పరపతి ఎక్కువ ఉండడంతో.. చివరికి ఉ పసభాపతి పోస్టును సాధించారు.

# టీడీపీలో కోవర్టుల కలకలం

విజయవాడ, జూన్ 9, తెలుగుదేశం పార్టీలో కోవర్టులు చేరుతున్నారన్న ప్రచారంతో ఆ పార్టీ అప్రమత్తమయింది. చాలా నియోజకవర్గాల్లో వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలు టీడీపీలో చేరుతున్నారు. వీరి వల్ల అనేక సమస్యలు వస్తున్నాయని.. టీడీపీలో చేరి.. టీడీపీ కార్యకర్తలుగా మారి.. టీడీపీ నేతలను హత్యలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. స్వయంగా చంద్రబాబు నాయుడు ఇటీవల టీడీపీ కార్యకర్తల హత్యల విషయంలో ఇదే జరిగిందని పార్టీ ప్లీనరీలో చెప్పారు. కోవర్టులు ఉన్నారని వారిని ఏరివేస్తానని హెచ్చరించారు. ఈ క్రమంలో పార్టీ నాయకత్వం చేరికలపై ఆంక్షలు విధించింది. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీల్లోకి పెద్ద ఎత్తున వలసలు వస్తాయి. ప్రతీ సారి ఇదే సమస్య ఉంటుంది. ఈ సారి మూడు పార్టీల కూటమిగా ఎన్నికల్లో పోటీ చేసి గెలిచింది. వైసీపీ పూర్తి గా సమస్యల్లో పడటం,ద్వితీయ శ్రేణి నాయకులు తమ అవసరాల కోసం ఈ మూడు పార్టీల్లో ఒక దాంట్లో చేరేందుకు ప్రయత్నించడం కామన్ గా మారిపోయింది. జిల్లా స్థాయి నేతల చేరికల విషయంలో మూడు పార్టీలు కలిసి నిర్ణయం తీసుకుంటున్నాయని చెబుతున్నారు. అయితే కింది స్థాయి .. గ్రామ స్థాయి క్యాడర్ విషయంలో మాత్రం పార్టీ నేతలు స్వచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అయితే అలా చేరుతున్న వారిలో కోవర్టులు, నేరగాళ్లు ఉండటం ఆ పార్టీకి సమస్యగా మారింది. కోవర్టుల విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు స్పష్టమైన సమాచారం ఉండటంతో పలుమార్లు పార్టీ వేదికలపై సూటిగానే హెచ్చరికలు జారీ చేశారు. రాజకీయంగా అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం కష్టపడిన వారి అవకాశాలను కొట్టేయడానికి చాలా మంది చేరుతున్నారని అనుమానిస్తున్నారు. చంద్రబాబు నేరుగా హెచ్చరించినా కోవర్టుల చేరికలు ఆగకపోవడంతో అధికారికంగా సమాచారం పంపినట్లుగా చెబుతున్నారు. ఇక ముందు నుంచి ఎవరూ టీడీపీలో చేరాలన్నా పార్టీ హైకమాండ్ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఆ ఎన్నికల్లో అవకాశాల కోసం చాలా మంది ఇతర పార్టీల నేతలు టీడీపీలోకి వస్తున్నారు. మాచర్లలో జరిగిన టీడీపీ నేతల జంట హత్యల వెనుక ఇలా అవకాశాల కోసం వచ్చిన వారే ఉన్నారని.. వారు తమ అవకాశాలను మెరుగుపర్చుకోవడానికి టీడీపీలో ఉన్న వారిని హత్య చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. వారు అంతకు ముందు వైసీపీలో ఉండేవారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం.. చేరికలు ఆపేయడమేనని నర్ణయానికి వచ్చారు. ఒకటి, రెండు సార్లు ఆలోచించుకోవాలిటిడిపిలో చేరాలనుకునే వారికి షరతులు వర్తిస్తాయి అంటోంది ఆ పార్టీ హై కమాండ్. చేరికల విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.' టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశానుసారం ఇతర పార్టీ నాయకులను టిడిపిలోకి జాయిన్ చేసుకునే ముందు తప్పనిసరిగా వారి గురించి కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలి. వారి గురించి పూర్తిగా కేంద్ర కార్యాలయం విచారణ చేసిన తర్వాత పార్టీ అనుమతితో వారిని ఆహ్వానించాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీలో వివిధ హోదాల్లో ఉన్నటువంటి నాయకులు అందరూ గమనించగలరు' అంటూ మంగళగిరి కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల తెలుగుదేశం పార్టీలో జరిగిన పరిణామాల దృష్ట్యా హై కమాండ్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోందిగత మాదిరిగా పార్టీలో చేరాలనుకునే వారికి చేర్చుకుంటామంటే కుదరదు. కచ్చితంగా కేంద్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అక్కడ నుంచి అనుమతి వచ్చిన తర్వాతే టిడిపిలో చేరికలు ఉంటాయని స్పష్టత ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పెద్ద ఎత్తున టిడిపిలో చేరారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నేతలు అధికార పార్టీలోకి వచ్చారు. అయితే వీరిలో కొందరు కోవర్టులు ఉన్నారని సీఎం చంద్రబాబు స్వయంగా కడప మహానాడు వేదికగా కామెంట్ చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఇస్తామన్నారు. కొవ్వొత్తులను పార్టీలోకి పంపాలనుకుంటే ఆటలు సాగవని.. వలస పక్షులు వస్తాయి.. పోతాయి అంటూ కామెంట్స్ చేశారు. కొవ్వొత్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. మొదటినుంచి జండా మోసిన వారిని కాదని కొత్తగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యమిస్తున్నారని హై కమాండ్ కు ఫిర్యాదులు వెల్లువెత్తుతాయి. ఈ పరిస్థితుల్లోనే హై కమాండ్ ఈ ప్రత్యేక ప్రకటన చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు పవన్ కళ్యాణ్ సైతం తమ పార్టీ శ్రేణులకు మరోసారి అల్టిమేటం ఇచ్చారు. పార్టీ లైన్ దాటి మాట్లాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు పార్టీలు ఏకకాలంలో ఈ ప్రకటన చేయడంపై భిన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. నిఘా వర్గాల హెచ్చరికతోనే ఈ రెండు పార్టీలు అలాంటి ప్రకటన చేసి ఉంటాయని అనుమానాలు వస్తున్నాయి.

# డ్రోన్ సహాయంతో పోలీసుల ఓపెన్ డ్రింకింగు రైడ్స్

విజయనగరం విజయనగరం పట్టణం వన్ టౌన్, టూ టౌన్ పోలీసు స్టేషను పరిధిలోని శివారు ప్రాంతాల్లో జూన్ 7న ఓపెన్ డ్రింకింగు చేస్తున్న వారిపై పోలీసులు డ్రోన్స్ సహాయంతో రైడ్స్ నిర్వహించి, ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకొని, వారిపై 'ఓపెన్ డ్రింకింగు' కేసులు నమోదు చేసారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - విజయనగరం 1వ, 2వ పట్టణ పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో 2వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలోని పూల్బాగ్ కాలనీ నందిగుడ్డి ప్రాంతంలోను, 1వ పట్టణ పోలీసు స్టేషను పరిధిలోని కనపాక, అయ్యన్నపేట ఏరియాల్లో బహిరంగ ప్రదేశాల్లో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై డ్రోన్ను పంపి, ఆయా ప్రాంతాల్లో కొంతమంది వ్యక్తులు ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్నట్లుగా గుర్తించి, రైడ్స్ నిర్వహించినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. వన్ టౌన్ పోలీసు స్టేషను వరిధిలో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై ఆరు కేసులు, టూ టౌన్ పోలీసు స్టేషను పరిధిలో ఓపెన్ డ్రింకింగుకు పాల్పడుతున్న వారిపై 11 కేసులను నమోదు చేసామన్నారు. పేకాట, ఓపెన్ డ్రింకింగు, ట్రాఫిక్ రెగ్యులేషను, జాతర్లు, దర్నాల నిర్వహణలో అనుమానస్పద వ్యక్తుల ఆచూకీని కనిపెట్టేందుకు డ్రోన్ వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.నేర నియంత్రణలోను, శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు డ్రోన్స్ ను వినియోగించాలని, శివారు ప్రాంతాలపై నిఘా పెట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.

# ఆ సేవలు బంద్...

విజయవాడ, జూన్ 9, ఏపీ సచివాలయాల్లో సేవలు బంద్.. కారణం అదే!

ఏపీ ప్రభుత్వం ప్రజలకు కీలక సమాచారం ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్లైన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేయడం హాట్ టాపిక్ గా మారింది. జూన్ 10 మంగళవారం రాత్రి వరకు సేవలను నిలిపివేయనున్నట్లు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది.ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. అయితే సాంకేతిక అంశాలతోనే ఈ సేవలకు అంతరాయం కలుగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే దీనిపై పెద్ద ఎత్తున సచివాలయ ఉద్యోగులు ప్రచారం చేస్తున్నారు. సేవలు నిలిచిపోతాయని ముందుగానే ప్రజలకు సూచించారు. అయితే ఇది ఒక హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ సాగుతోంది. ఇంకోవైపు విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులకు దృవపత్రాలు అవసరం అవుతాయి. ఇటువంటి సమయంలో ఆన్లైన్ సేవలు నిలిపివేయడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఏపీ సేవా పోర్టల్ ను మైక్రోసాఫ్ట్ క్లౌడ్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ డేటా సెంటర్కు మై గ్రేట్ అవుతోంది. ఈ డేటా మార్పిడి ప్రక్రియ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో కొన్ని ముఖ్యమైన ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉండకపోవచ్చు అని అధికారులు ముందుగానే వెల్లడించారు. ముఖ్యంగా తాత్కాలికంగా నిలిచే ముఖ్యమైన సేవలపై స్పష్టతనిచ్చారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, సమగ్ర ధ్రువీకరణ పత్రం, భూమి మ్యూటేషన్లు, ఇళ్ల స్థలాల దరఖాస్తులు, వృద్ధాప్య ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు సంబంధిత సేవలు, రెవెన్యూ సేవలు, వాటర్ ట్యాక్స్, ప్రాపర్టీ టాక్స్ పేమెంట్లు, పట్టణ పరిపాలన శాఖ సేవలు, మత్స్య శాఖ సేవలు నిలిపి వేస్తున్నట్లు చెప్పింది. అయితే ఈ ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాలకు వెళ్తున్న వారికి నిరాశ ఎదురవుతోంది.అయితే ఇది తప్పకుండా చేయాల్సిన మార్పు అని? మంగళవారం రాత్రి నుంచి యధాతథంగా సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ ఆన్లైన్ మార్పుల ప్రభావం అన్ని ప్రభుత్వ సేవలపై ఉండదని కూడా అధికారులు చెబుతున్నారు. ఆధార్ అప్డేట్స్ బ్యాంకు సేవలు, పలు కేంద్ర ప్రభుత్వం స్కీములు, నాన్ రెవెన్యూ ఆధారిత సేవలు వంటి కొన్ని సేవలు మీ సేవ కేంద్రాల్లో యధావిధిగా అందుబాటులోకి ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అత్యవసర పనుల కోసం ముందుగానే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు లేదా అప్లికేషన్లు చేసుకోవాలని సూచిస్తున్నారు. అంతరాయం ముగిసిన వెంటనే సేవలు మళ్లీ పూర్వస్థితికి తీసుకొస్తామని చెప్పుకొస్తున్నారు. మొత్తానికి అయితే సచివాలయాల సేవలకు అంతరాయం కలు[illegible]

# నాలుగేళ్ల ముందే అలెర్ట్...

## బ్యాడ్ నేమ్ తెచ్చుకుంటున్న ఎమ్మెల్యేలపై గురి

విజయవాడ, జూన్ 9, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు నాలుగేళ్లకు ముందే అలెర్ట్ అయినట్లు కనిపిస్తుంది. ఎమ్మెల్యేల పనితీరును గమనించకపోతే అసలుకే ఎసరు వస్తుందని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. గత ఎన్నికల్లో కూటమి హవాలో 164 స్థానాల్లో సూపర్ డూపర్ విక్టరీ సాధించినప్పటికీ గత ఏడాదిగా కూటమి పార్టీల నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో, కిందిస్థాయిలో ఆశావహులు ఎక్కువగా ఉండటంతో పాటు విభేదాలు మరింతగా ముదిరి వీధిన పడుతుండటంతో మూడు పార్టీలకు తలనొప్పిగా తయారయింది. అన్ని చోట్ల ఆధిపత్య పోరు కనిపిస్తుంది. ఇక ఎమ్మెల్యేల పనితీరు కూడా అంత ఆశాజనకంగా లేదని అందుతున్న నివేదికలను బట్టి తెలుస్తోంది ప్రధానంగా ఈసారి ఎన్నికల్లో అత్యధికంగా 88 మంది వరకూ మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. మొదటి సారి గెలిచిన ఎమ్మెల్యేలతోనే సమస్య తలెత్తుతోంది. సీనియర్ ఎమ్మెల్యేలు ఉన్నచోట్ల ఈ సమస్య పెద్దగా కనిపించడం లేదు. వారిపై పెద్దగా ఆరోపణలు కూడా రావడం లేదు. ఎందుకంటే వారి అనుభవంతో అనేక విషయాలను బయటకు రాకుండానే సహజంగా జాగ్రత్త పడుతున్నారు. కానీ కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు మాత్రం నేరుగా రంగంలోకి దిగి బ్యాడ్ నేమ్ ను కొని తెచ్చుకుంటున్నారు. ఇసుక తరలింపు, మద్యం షాపుల వేలంపాటలు, బార్లను కొనసాగించడం, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో తలదూర్చడం వంటి విషయాల్లో కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేల పేర్లు జనం నోళ్లతో నానుతున్నాయి.. ఒకవైపు సంక్షేమ పథకాలు అందలేదని జనంలో అసంతృప్తి ఉన్న నేపథ్యంలో మరొకవైపు అవినీతిని ఎమ్మెల్యేలే దగ్గరుండి ప్రోత్సహిస్తుండటం కూడా ప్రజల్లో పలచనకు కారణమయింది. ఇలాగే ఉపేక్షిస్తే వచ్చే ఎన్నికల్లో దారుణమైన ఫలితాలు చూడాల్సి వస్తుందని చంద్రబాబు తన అనుభవంతో ముందే గుర్తించారు. తాము పరిపాలనలో ఎన్ని సంస్కరణలు, ఎన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలు సక్రమంగా లేకపోతే అసలుకే మోసం వస్తుందని భావించిన చంద్రబాబు నాయుడు నాలుగేళ్ల ముందే అప్రమత్తమయ్యారు. అందుకే ఎమ్మెల్యేలను గాడిలో పెట్టేందుకు తన వంతుగా ఆయన ప్రయత్నాలను ప్రారంబిస్తున్నట్లు కనపడుతుంది. ఇందులో భాగంగానే చంద్రబాబు నాయుడు మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పనిచేయాలని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. ప్రజలకు , కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలి.. వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదనేది తన ఆలోచన అని నేరుగా చెప్పేశారు. ప్రజలు అన్నీ గమనిస్తారని, జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే ఇబ్బందులు పడతారని చంద్రబాబు గట్టిగానే హెచ్చరించినట్లు తెలిసింది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు, నివేదికలు తెప్పించుకునేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. అంతేకాదు తాను మంచి చేస్తే అభినందిస్తానని, తప్పు చేస్తే దూరం పెడతానని కూడా చెప్పారు. త్వరలోనే ఒక్కో ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు నిర్వహించేందుకు కూడా చంద్రబాబు సిద్ధమవుతుండటం చూస్తుంటే కూటమికి డేంజర్ బెల్స్ మోగుతున్నాయని చంద్రబాబుకు కూడా అర్థమయినట్లే కనిపిస్తుంది.తలనొప్పిగా మారిన సవితమొదటి సారి ఎమ్మెల్యే అయ్యారు. అదృష్టం బాగుండి చంద్రబాబు కేబినెట్ లో మంత్రి అయి కూర్చున్నారు. దీంతో మంత్రి సవితకు ఏమీ అర్థం కావడం లేదు. కనీసం అధికారులను గౌరవించడం కూడా తెలయకుండా మంత్రులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఫస్ట్ టైమ్ గా ఎన్నికై అదేదో తమ వల్లనే గెలిచామన్న భావనలో విర్రవీగుతుండటంతోనే ఈ సమస్య తలెత్తుతుంది. మంత్రులలో కొందరు అందులోనూ తొలిసారి మంత్రి అయిన వారు చంద్రబాబు నాయుడుతో పాటు పార్టీకి కూడా తలనొప్పులుగా మారుతున్నారు. గతంలో కడప జిల్లాకు చెందిన మంత్రి మడింపల్లి రాంప్రసాద్ రెడ్డి సతీమణి పోలీసు అధికారిపైనే జులుం ప్రదర్శించారు. దీంతో చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. ఆ దెబ్బకు మడింపల్లి రాంప్రసాద్ రెడ్డితో పాటు ఆయన సతీమణి కూడా క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి వచ్చింది. మంత్రులు అప్పనంగా వచ్చిన పదవులను అనుభవించడంలో తమ దర్పాన్ని ప్రదర్శించడానికే ఇలా చేస్తున్నారా? లేక అతి విశ్వాసంతో ఈ పనులు చేస్తున్నారా? అన్నది తేలకుండా ఉంది. అయితే వీరి వ్యవహార శైలి మాత్రం మొత్తం కూటమి ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. ఎవరిని కట్టడి చేయలేని పరిస్థితి. తమకు అప్పగించిన శాఖల్లో పట్టు పెంచుకుని, ప్రజలకు సేవలందించాల్సిన అమాత్యులు అనవసర వివాదాల్లో కూరుకుని కూటమిని ఇబ్బందులు పాలు చేస్తున్నారు. ఎన్ని సార్లు చెప్పినా వీరి పరిస్థితుల్లో మార్పు కనిపించడం లేదు. తాజాగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కూడా చంద్రబాబు సర్కార్ కు తలనొప్పులు తెచ్చేలా వ్యవహరించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. పెనుకొండ టిక్కెట్ తెచ్చుకోవడమే అదృష్టం. ఆపైన ఎమ్మెల్యే కావడం మరొక లక్కు. అదీ చాలక ఏకంగా మంత్రి పదవి వరించింది. అణిగి మణిగి ఉండాల్సిన మంత్రి సవిత మాత్రం రెచ్చిపోతున్నారు. అదీ అధికారులపైన మంత్రి సవిత దురుసు ప్రవర్తన సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పెనుకొండ తహశీల్దార్ శ్రీధర్ ఇచ్చిన బోకేను మంత్రి సవిత విసిరేసిన వీడియో వైరల్ గా మారింది. సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్ సమక్షంలో ఘటన జరిగింది. ఈ నెల ఒకటో తేదీన రేషన్ బియ్యం పంపిణీ సందర్భంగా ఈ ఘటన జరగడంతో మంత్రి సవిత తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# పంటి కింద నలుసుగా వర్మ..

కాకినాడ, జూన్ 9,పిఠాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేనల మధ్య విభేదాలు రోజురోజుకు ముదురుతున్నాయి. అక్కడ టీడీపీ నేతలకు, జనసేన నేతలకు మధ్య పొసగడం లేదు. పవన్ కల్యాణ్ మాజీ ఎమ్మెల్యే వర్మ కు ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ అక్కడ ఉన్న జనసేన ఇన్ ఛార్జులతో పాటు కార్యకర్తలు టీడీపీ నేతలు లెక్క చేయడం లేదు. కనీసం ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా ఆహ్వానాలు ఉండటం లేదు. దీంతో జనసేన నేతల పర్యటనల్లో టీడీపీ నేతలు జై వర్మ.. జై జై టీడీపీ అన్న నినాదాలు పెద్దయెత్తున వినిపిస్తున్నాయి. నాగబాబు పర్యటించినప్పుడు కూడా ఇవే నినాదాలు వినిపించాయి. అయితే జనసేన లోకల్ లీడర్స్ మాత్రం పట్టించుకోవడం లేదు. మరొకవైపు మాజీ ఎమ్మెల్యే వర్మ కూడా ఇక లాభం లేదనుకున్నాడో ఏమో రివర్స్ అటాక్ కు రెడీ అయినట్లు కనపడుతుంది. ఇటు కూటమి ధర్మానికి తూట్లు పడకుండానే, జనసేన నేతలను ఇరుకునపడేలా ఆయన చేస్తున్న కామెంట్స్ వైరల్ గా మారుతున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలో ఇసుక దోపిడీ కొనసాగుతుందని తెలిపారు. ఇసుక మాఫియా పిఠాపురం నియోజకవర్గంలో రాజ్యమేలుతుందని, రాత్రి వేళ రెండు వందల లారీల ఇసుకను తరలిస్తున్నారని కూడా వర్మ వ్యాఖ్యానించడం విశేషం. పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, పోలీసులకు కూడా భారీగానే ముడుపులు ముడుతున్నట్లు అనిపిస్తుందని వర్మ అనడం మరింత ఇబ్బంది పెట్టేలా ఉంది ఉప ముఖ్యమంత్రిగా అందరికీ ఆదర్శంగా ఉందామనుకుంటున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని మిత్ర పక్షానికి చెందిన నాయకుడు విమర్శలు చేస్తుంటే పవన్ పరువు పోవడమే కాకుండా, పిఠాపురంలో ఏదో జరుగుతుందని అందరకీ అర్థమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

# శ్రీశైలం ప్రాజెక్టుకు స్పందించకపోతే భారీ ప్రమాదం తప్పదా?

కర్నూలు, జూన్ 9, కృష్ణానది ప్రవాహం ఆధారంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు శ్రీశైలం జలాశయం నిర్మించారు. ఇది ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉంది.తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకమైన శ్రీశైలం జలాశయం ప్రమాదంలో పడిందా? ఈ జలాశయానికి సంబంధించి అక్కడి ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే పెను విపత్తు తప్పదా? దీనికి అవును అని సమాధానం చెబుతున్నాయి ఏపీ ప్రభుత్వ వర్గాలు. ఎంతో ఉదాత్తమైన ఆశయంతో నిర్మించిన ఈ జలాశయం ప్రమాదంలో ఎందుకు పడింది? ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే జరిగే నష్టం ఏమిటి?కృష్ణానది ప్రవాహం ఆధారంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు శ్రీశైలం జలాశయం నిర్మించారు. ఇది ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉంది. శ్రీశైలం జలాశయంలో నీటి ద్వారా విద్యుతును ఉత్పత్తి మాత్రమే కాకుండా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీటిని సరఫరా చేస్తారు. ఈ జలాశయం ఆధారంగా వేలాది ఎకరాలలో పంటలు పండుతున్నాయి. రెండు కొండల మధ్య శ్రీశైలం జలాశయాన్ని నిర్మించారు. ఇక్కడ కృష్ణానది నీరు గ్రావిటీ ఆధారంగా కిందికి సరఫరా అవుతుంది. తెలంగాణ రాష్ట్రంలోని జూరాల ప్రాజెక్టులో నీరు శ్రీశైలానికి.. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సరఫరా అవుతుంది.. శ్రీశైలం నిండితే రెండు తెలుగు రాష్ట్రాలలో పంటలకు ఇబ్బంది ఉండదు. పైగా నాగార్జునసాగర్ కు ప్రధాన నీటి వనరుగా శ్రీశైలం జలాశయం ఉంది. శ్రీశైలం జలాశయం ఒకప్పుడు లోతుగా ఉండేది. అయితే గత కొంతకాలంగా ఈ జలాశయంలో పూడిక పేరుకు పోతోంది. ఈ పూడిక వల్ల జలాశయం నిల్వనీటి సామర్థ్యం తగ్గిపోతుంది. వర్షాకాలంలో వరదలు వచ్చినపుడు ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తోంది. మార్చి నెల వచ్చేసరికి ప్రాజెక్టు నిండుకుంటున్నది. దీనివల్ల వేసవికాలంలో తాగునీటికీ ఇబ్బంది ఏర్పడుతోంది. అందువల్లే శ్రీశైలం ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికను తొలగించాలని ఎప్పటినుంచో విజ్ఞప్తులు వస్తున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.ఇక శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించి నీరు విడుదల చేసే క్రమంలో డ్యామ్ గేట్లు తెరుస్తారు. ఆ సమయంలో నీళ్లు సరఫరా అయ్యే చోట భారీగా గొయ్యి ఏర్పడింది. దీన్ని నీటిపారుదల శాఖ పరిభాషలో "ప్లంజ్ పూల్" అని పిలుస్తుంటారు. వాస్తవానికి ఈ గుంత దశాబ్దల క్రితమే మొదలైంది. ఇప్పుడు ఏకంగా తాటి చెట్టు అంత పొడుగు లోతు విస్తరించింది. దీనివల్ల ప్రాజెక్టు పునాదులు దెబ్బతినే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ గుంత సమస్య పరిష్కారానికి శాస్త్రవేత్తల బృందం కొద్ది రోజుల క్రితం నుంచి సర్వే చేస్తోంది. ఈ సర్వే పూర్తయిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. లేనిపక్షంలో జలాశయం పునాదులు కదిలిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఒకవేళ జలాశయం పునాదులు గనుక కదిలిపోతే అప్పుడు జరిగే ప్రమాదం తీవ్రత అధికంగా ఉంటుంది. పరిస్థితి అక్కడిదాకా వచ్చే కంటే ముందే.. మేల్కోవడం మంచిదని శాస్త్రవేత్తలు అంటున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతంలో కృష్ణా నదికి విపరీతమైన వరదలు వచ్చాయి. ఆ సమయంలో నీరు అధికంగా రావడంతో శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి నీరు బయటికి వచ్చింది. నాటి ఘటనలో కర్నూలు జిల్లా మొత్తం మునిగిపోయింది. నష్టం తీవ్ర స్థాయిలో వాటిల్లింది.

# భక్తుల రద్దీతో సింహాచలం

విశాఖపట్నం,వేదమంత్రాలతో పులకిం చిన సింహగిరి విశాఖ భక్త జనంతో కోలాహాలంగా మారింది.దక్షిణ భార త దేశంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న సింహచలం శ్రీవర హా లక్ష్మీనృసింహ స్వామి ఆలయం లో భక్తుల కోలాహాలం నెలకొంది. ఆదివారం సింహగిరి భక్తులతో శోభాయమానంగా నిలిచింది. భక్తు ల హరి నామస్మరణతో సింహగిరి పులకరించింది. సింహాద్రినాధుడు జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకు ని ప్రత్యక్షంగా పరోక్షంగా 119 జంటలు స్వామివారి స్వాతి హోమాన్ని వీక్షించారు.ఆలయ అర్చకులు తెల్లవారుజామునే సింహగిరిపై ప్రభాత ఆరాధానలు పూర్తిచేశారు. తదుపరి సుదర్శన స్వామిని ఆలయ ఉత్తర రాజగోపు రం వద్ద గల గ్రౌండ్లో ఏర్పాటుచేసిన ఆస్తాన మండపంలో ఆశీనులను చేసి ఒకవైపు సర్వాభరణాలతో గోవిందరాజు స్వామి,మరోవైపు శ్రీ సుదర్శన చక్ర పెరుమాళ్ ను వేద మంత్రాలతో మృధు మధుర మంగళ వాయిద్యాలు నడుమ శాస్త్రోక్తముగా ఆలయ స్థానాచార్యు లు టి పి రాజగోపాల్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యు లు పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు కలశారాధన,మండపం, బింభారాధనలు పూర్తి చేశారు. అనంతరం భక్తులచే నృసింహ స్వామి అష్టోత్తర శతనామావళి పూజ చేయించారు.



# ఎముకల బలాన్ని తగ్గించే ఆహారాలు.. ఇవి తిన్నారో.. మీ పని అంతే!



ఎముకలు మన శరీరానికి ఆధారం. అవి మనల్ని నిలబడడానికి, కదలడానికి , మన అంతర్గత అవయవాలను రక్షించడానికి సహాయపడతాయి. బలమైన ఎముకలు ఆరోగ్యకరమైన జీవనానికి చాలా అవసరం. వయస్సు పెరిగే కొద్దీ ఎముకలు సహజంగా బలహీనపడతాయి, కానీ కొన్ని రకాల ఆహారాలు తీసుకోవడం వల్ల ఈ ప్రక్రియ వేగవంతం అవుతుంది. ఎముకల బలాన్ని తగ్గించే ఆహారాలు: ఉప్పు (సోడియం): అధిక మొత్తంలో ఉప్పు తీసుకోవడం వల్ల శరీరంలో కాల్షియం కోల్పోవడం జరుగుతుంది. ఇది ఎముకలను బలహీనపరుస్తుంది. ప్రాసెస్ చేసిన ఆహారాలు, ప్యాక్ చేసిన స్నాక్స్, రెడీమేడ్ సూప్‌లలో ఉప్పు ఎక్కువగా ఉంటుంది. రోజుకు 2.3 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తీసుకోకూడదని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. "విటమిన్ బి 12 లోపం ఉందా.. అయితే ఈ ఆరోగ్య సమస్యలు తప్పవు!" కెఫిన్: కాఫీ, టీ , కొన్ని శీతల పానీయాలలో కెఫిన్ ఉంటుంది. అధిక కెఫిన్ తీసుకోవడం వల్ల కాల్షియం శోషణ తగ్గుతుంది . ఎముకలు బలహీనపడతాయి. రోజుకు 400 మి.గ్రా కంటే ఎక్కువ కెఫిన్ తీసుకోకూడదు. ఆల్కహాల్: అధికంగా మద్యం సేవించడం వల్ల ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. ఎముకలు పెళుసుగా మారతాయి. ఇది ఆస్టియోపోరోసిస్ ప్రమాదాన్ని పెంచుతుంది. మహిళలు రోజుకు ఒక డ్రింక్ , పురుషులు రోజుకు రెండు డ్రింక్స్‌కు పరిమితం చేయాలి. ఖీవఇనీఎవనిటవట ఈనీతీ జనీబీ "జీన్స్ వేసుకుని నిద్రపోతున్నారా? ఇది సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతుందా?" కార్బోనేటేడ్ పానీయాలు (సోడా): కోలా , ఇతర కార్బోనేటేడ్ పానీయాలలో ఫాస్ఫారిక్ యాసిడ్ ఉంటుంది, ఇది కాల్షియం శోషణకు ఆటంకం కలిగిస్తుంది . ఎముకలను బలహీనపరుస్తుంది. రెడ్ మీట్ (ఎర్ర మాంసం): అధికంగా ఎర్ర మాంసం తీసుకోవడం వల్ల శరీరంలో ఆమ్లత్వం పెరుగుతుంది, దీనిని తటస్థీకరించడానికి శరీరం ఎముకల నుండి కాల్షియంను ఉపయోగిస్తుంది. చక్కెర: అధిక చక్కెర తీసుకోవడం వల్ల కాల్షియం శోషణ తగ్గుతుంది . ఎముకలు బలహీనపడతాయి. స్వీట్లు, కేకులు, కుకీలు , ఇతర తీపి పదార్థాలలో చక్కెర ఎక్కువగా ఉంటుంది"ఇనుప కడాయిలో వంట వండుతున్నారా? అయితే ఈ ఆరోగ్య సమస్యలు తప్పవు? " ట్రాన్స్ ఫ్యాట్స్: ప్రాసెస్ చేసిన ఆహారాలు, ఫాస్ట్ ఫుడ్ , కొన్ని రకాల నూనెల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి హానికరం . కాల్షియం శోషణను తగ్గిస్తాయి. ఫైటేట్స్: తృణధాన్యాలు, గింజలు , విత్తనాలలో ఫైటేట్స్ ఉంటాయి. ఇవి కాల్షియం శోషణను కొంత వరకు తగ్గిస్తాయి. అయితే, వీటిని నానబెట్టడం లేదా మొలకెత్తించడం ద్వారా ఫైటేట్స్ ప్రభావాన్ని తగ్గించవచ్చు. ఆక్సలేట్స్: పాలకూర, రబర్బ్ , బీట్‌రూట్‌లో ఆక్సలేట్స్ ఉంటాయి. ఇవి కాల్షియం శోషణను తగ్గిస్తాయి. అయితే, ఈ ఆహారాలను కాల్షియంతో కలిపి తీసుకోవడం ద్వారా ఈ ప్రభావాన్ని తగ్గించవచ్చు. ఎముకలను బలంగా ఉంచడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు: కాల్షియం అధికంగా ఉండే ఆహారాలు: పాలు, పెరుగు, చీజ్, ఆకుకూరలు, చేపలు మరియు బాదం వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. విటమిన్ డి కాల్షియం శోషణకు సహాయపడుతుంది. సూర్యరశ్మి ద్వారా శరీరం విటమిన్ డి ని ఉత్పత్తి చేస్తుంది. ఆహార పదార్థాల ద్వారా కూడా విటమిన్ డి ని పొందవచ్చు. రెగ్యులర్ వ్యాయామం ఎముకలను బలంగా ఉంచడానికి సహాయపడుతుంది. బరువులు ఎత్తడం, నడవడం, మరియు యోగా వంటి వ్యాయామాలు ఎముకల ఆరోగ్యానికి చాలా మంచివి. ఆరోగ్యకరమైన జీవనశైలి: ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రెగ్యులర్ వ్యాయామం చేయడం , తగినంత విశ్రాంతి తీసుకోవడం ద్వారా ఎముకలను బలంగా ఉంచుకోవచ్చు. బలమైన ఎముకలు ఆరోగ్యకరమైన జీవనానికి చాలా అవసరం. పైన పేర్కొన్న ఆహారాలను పరిమితం చేయడం , ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా ఎముకలను బలంగా ఉంచుకోవచ్చు. మీకు ఎముకల ఆరోగ్యానికి సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే, వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

# ఇనుప కడాయిలో వంట వండుతున్నారా? అయితే ఈ ఆరోగ్య సమస్యలు తప్పవు?

ఇనుప కడాయిలో వంట చేయడం ఆరోగ్యానికి మంచిదని చాలామంది నమ్ముతారు. ఇది నిజమే, ఇనుప పాత్రలో వంట చేయడం వల్ల ఆహారానికి కొంత ఇనుము చేరుతుంది, ఇది రక్తహీనత సమస్య ఉన్నవారికి ఉపయోగపడుతుంది. అయితే, అన్ని రకాల ఆహార పదార్థాలను ఇనుప కడాయిలో వండకూడదని మీకు తెలుసా? కొన్ని రకాల ఆహారాలు ఇనుప కడాయిలో వండటం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. వాటి గురించి వివరంగా తెలుసుకుందాం.. ఇనుప కడాయిలో వండకూడని ఆహారాలు: పుల్లని ఆహారాలు: టమోటా, చింతపండు, నిమ్మరసం వంటి పుల్లని పదార్థాలను ఇనుప కడాయిలో వండకూడదు. ఈ పదార్థాలలో ఉండే ఆమ్లాలు ఇనుముతో రసాయన చర్య జరిపి ఆహారానికి రంగు, రుచి మార్చేస్తాయి. అంతేకాకుండా, ఇనుము ఎక్కువగా ఆహారంలోకి చేరడం వల్ల ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయి. "విటమిన్ బి 12 లోపం ఉందా.. అయితే ఈ ఆరోగ్య సమస్యలు తప్పవు!" పాలకూర , వంకాయ: పాలకూర , వంకాయ వంటి కూరగాయలను కూడా ఇనుప కడాయిలో వండకూడదు. వీటిలో ఉండే కొన్ని రసాయనాలు ఇనుముతో చర్య జరిపి ఆహారం నల్లగా మారే అవకాశం ఉంది. గుడ్లు,బీట్‌రూట్: గుడ్లను ఇనుప కడాయిలో వండటం వల్ల అవి కడాయికి అంటుకుంటాయి. వాటి రుచి కూడా మారవచ్చు. బీట్‌రూట్‌లో సహజంగానే ఐరన్ ఎక్కువగా ఉంటుంది. దీనిని ఇనుప కడాయిలో వండటం వల్ల ఆహారంలోని పోషకాలు తగ్గిపోయే అవకాశం ఉంది. "మూత్రంలో మంటను తేలికగా తీసుకుంటున్నారా? ఎంత డేంజరో తెలుసా?" తీపి, పిండి పదార్థాలు: పాస్తా, ఇతర పిండి పదార్థాలు ఇనుప కడాయి అడుగు భాగానికి అంటుకునే అవకాశం ఉంది, దీనివల్ల అవి మాడిపోతాయి. తీపి పదార్థాలను ఇనుప కడాయిలో వండటం వల్ల వాటి రుచి మరియు వాసన మారవచ్చు. మాంసం, చేపలు: పూర్వం ఇనుప కడాయిలో మాంసం వండేవారు, కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో మాంసాన్ని ఇనుప కడాయిలో వండటం వల్ల జీర్ణక్రియ సమస్యలు వచ్చే అవకాశం ఉంది అని నిపుణులు చెబుతున్నారు. కొన్ని రకాల చేపలు ఇనుప కడాయికి అంటుకుని వాటి రుచిని మార్చేస్తాయి.



ఇనుప కడాయిలో వంట చేయడం వల్ల వచ్చే ఇతర సమస్యలు: "నాన్ వెజ్ ఆహారంలో నిమ్మకాయ పిండుకుని తింటున్నారా? ఏం జరుగుతుందో తెలుసుకోండి!" ఆహారానికి ఇనుము ఎక్కువగా చేరడం: ఇనుప కడాయిలో వంట చేయడం వల్ల ఆహారానికి కొంత ఇనుము చేరుతుంది. ఇది ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, ఎక్కువగా ఇనుము చేరడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఇనుప కడాయిని సరిగ్గా శుభ్రం చేయకపోతే అది నల్లగా మారుతుంది. కొన్ని రకాల ఆహారాలు ఇనుప కడాయిలో వండటం వల్ల వాటి రుచిలో మార్పులు వస్తాయి. మరి ఏ పాత్రలు వాడాలి? ఆహార పదార్థాలను వండడానికి మీరు స్టెయిన్‌లెస్ స్టీల్, నాన్-స్టిక్ లేదా మట్టి పాత్రలను ఉపయోగించవచ్చు. అయితే ఇనుప కడాయిని ఉపయోగించే ముందు దానిని నూనెతో బాగా కడిగి వేడి చేయాలి. వంట చేసిన తర్వాత కడాయిని వెంటనే శుభ్రం చేయాలి. కడాయిని పొడిగా ఉంచాలి, లేకపోతే అది తుప్పు పట్టే అవకాశం ఉంది. ఇనుప కడాయిలో వంట చేయడం ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, అన్ని రకాల ఆహారాలను అందులో వండకూడదు. పైన చెప్పిన విషయాలను దృష్టిలో ఉంచుకుని మీరు సరైన పాత్రను ఎంచుకోవడం మంచిది.

# మూత్రంలో మంటను తేలికగా తీసుకుంటున్నారా? ఎంత డేంజరో తెలుసా?



మూత్రంలో మంట అనేది ఒక సాధారణ సమస్య, ఇది పురుషులు, స్త్రీలు ఇద్దరినీ బాధించవచ్చు. ఇది మూత్ర విసర్జన సమయంలో నొప్పి, మంట లేదా కుట్టడం వంటి అనుభూతిని కలిగిస్తుంది. ఈ లక్షణం అనేక కారణాల వల్ల సంభవించవచ్చు, కొన్ని తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతంగా కూడా ఉండవచ్చు. కాబట్టి, మూత్రంలో మంటను తేలికగా తీసుకోకూడదు . అవసరమైతే వైద్యుడిని సంప్రదించాలి. మూత్రంలో మంటకు గల కారణాలు: మూత్ర నాళాల ఇన్ఫెక్షన్ ఇది మూత్రంలో మంటకు అత్యంత సాధారణ కారణం. బాక్టీరియా మూత్ర నాళంలోకి ప్రవేశించినప్పుడు ఈ ఇన్ఫెక్షన్ వస్తుంది. స్త్రీలు పురుషుల కంటే ఎక్కువగా జుఎ బారిన పడతారు. జుఎ లక్షణాలు మూత్రంలో మంటతో పాటు, తరచుగా మూత్ర విసర్జన, మూత్ర విసర్జన చేయాలనే అత్యవసర కోరిక, కడుపు నొప్పి , వెన్ను నొప్పిని కలిగి ఉంటాయి. "విటమిన్ బి 12 లోపం ఉందా.. అయితే ఈ ఆరోగ్య సమస్యలు తప్పవు!" లైంగికంగా సంక్రమించే ఇన్ఫెక్షన్లు (ూఎబ): క్లామిడియా, గనేరియా , ట్రైకోమోనియాసిస్ వంటి ూఎబ కూడా మూత్రంలో మంటను కలిగిస్తాయి. ఈ ఇన్ఫెక్షన్లు లైంగిక సంబంధం ద్వారా వ్యాపిస్తాయి. లక్షణాలు జననేంద్రియాల నుండి స్రావాలు, దురద , నొప్పిని కలిగి ఉంటాయి. మూత్ర నాళాల వాపు: ఇది మూత్ర నాళం యొక్క వాపు, ఇది బాక్టీరియా లేదా వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వస్తుంది. యురేథ్రిటిస్ లక్షణాలు మూత్రంలో మంట, జననేంద్రియాల నుండి స్రావాలు మరియు నొప్పిని కలిగి ఉంటాయి. "నాన్ వెజ్ ఆహారంలో నిమ్మకాయ పిండుకుని తింటున్నారా? ఏం జరుగుతుందో తెలుసుకోండి!"ఖనీలివతీవట ఃఎప్రోస్టేట్ వాపు :ఇది ప్రోస్టేట్ గ్రంథి యొక్క వాపు, ఇది పురుషులలో మాత్రమే ఉంటుంది. ప్రోస్టేటిస్ లక్షణాలు మూత్రంలో మంట, మూత్ర విసర్జనలో ఇబ్బంది, కటి నొప్పి మరియు వీపు నొప్పిని కలిగి ఉంటాయి. మూత్రపిండాల్లో రాళ్లు: మూత్రపిండాల్లో రాళ్లు మూత్ర నాళంలోకి వెళ్ళినప్పుడు, అవి మూత్రంలో మంటను కలిగిస్తాయి. మూత్రపిండాల్లో రాళ్ల లక్షణాలు తీవ్రమైన కడుపు నొప్పి, వెన్ను నొప్పి, వికారం మరియు వాంతులు కలిగి ఉంటాయి. తగినంత నీరు త్రాగకపోవడం వల్ల కూడా మూత్రంలో మంట వస్తుంది రసాయన చికాకు: కొన్ని సబ్బులు, లోషన్లు మరియు ఇతర ఉత్పత్తులు మూత్ర నాళాన్ని చికాకు పెట్టవచ్చు . మూత్రంలో మంటను కలిగిస్తాయి. కొన్ని మందులు మూత్రంలో మంటను దుష్ప్రభావంగా కలిగిస్తాయి. . మూత్రంలో మంట లక్షణాలు: జనీబీ ఓజీఎ ంశ్రీబనీ ఒతిఎివ "నోటి దుర్వాసనను తేలిగ్గా తీసుకుంటున్నారా? ఇది ఎంత ప్రమాదమో తెలుసా?" మూత్రంలో మంట యొక్క ప్రధాన లక్షణం మూత్ర విసర్జన సమయంలో నొప్పి, మంట లేదా కుట్టడం వంటి అనుభూతి. ఇతర లక్షణాలు కారణాన్ని బట్టి మారుతూ ఉంటాయి. తరచుగా మూత్ర విసర్జన, మూత్ర విసర్జన చేయాలనే అత్యవసర కోరిక రావడం. మూత్ర విసర్జనలో ఇబ్బంది. కడుపు నొప్పి, వెన్ను నొప్పి, జననేంద్రియాల నుండి స్రావాలు, దురద, వికారం, వాంతులు వంటి లక్షణాలు సాధారణంగా కన్పిస్తాయి. వైద్యుడిని ఎప్పుడు సంప్రదించాలి: తీవ్రమైన మూత్రంలో మంట, మూత్రంలో రక్తం, జ్వరం, వెన్ను నొప్పి, వికారం , వాంతులు వంటి లక్షణాలు ఉంటే, మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. మూత్రంలో మంటకు చికిత్స: మూత్రంలో మంటకు చికిత్స కారణం యాంటీబయాటిక్స్ అవసరం కావచ్చు. ూఎబ లకు కూడా యాంటీబయాటిక్స్ లేదా ఇతర మందులు అవసరం కావచ్చు. మూత్రపిండాల్లో రాళ్లకు మందులు లేదా శస్త్రచికిత్స అవసరం కావచ్చు. ఇతర కారణాల వల్ల వచ్చే మూత్రంలో మంటకు కారణాన్ని బట్టి చికిత్స ఉంటుంది. రోజుకు తగినంత నీరు త్రాగాలి. మూత్ర విసర్జనను ఆపుకోకూడదు. లైంగిక సంబంధాల సమయంలో సురక్షితమైన పద్ధతులను పాటించాలి. జననేంద్రియ ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. చికాకు కలిగించే రసాయనాలను నివారించాలి. మూత్రంలో మంట అనేది ఒక అసౌకర్యమైన సమస్య, కానీ ఇది సాధారణంగా చికిత్స చేయగలదు. మీకు ఈ లక్షణాలు ఉంటే, సరైన రోగ నిర్ధారణ , చికిత్స కోసం వైద్యుడిని సంప్రదించడం ముఖ్యం. స్వీయ వైద్యం చేయకుండా ఉండటం చాలా ముఖ్యం, ఎందుకంటే ఇది సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది.

# జుట్టు రాలిపోతుందా.? అయితే ఇలా ట్రై చేస్తే చాలు కొత్త జుట్టు కూడా వస్తుంది.

ఉసిరికాయ షాట్ జుట్టు సమస్యలకు ఒక అద్భుతమైన సహజ పరిష్కారం. ఉసిరికాయ లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఉసిరికాయ షాట్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఎలా తయారు చేయాలి, ఇంకా ఇతర వివరాలు ఇక్కడ తెలుసుకుందాం... ఉసిరికాయ షాట్ యొక్క ప్రయోజనాలు: ఉసిరికాయలో విటమిన్ సి సమృద్ధిగా ఉండటం వల్ల జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తుంది. ఇది జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది , కొత్త జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఉసిరికాయలోని యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు కుదుళ్లకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి, తద్వారా జుట్టు పెరుగుదల ఆరోగ్యంగా ఉంటుంది. ఉసిరికాయలో యాంటీ ఫంగల్ మరియు యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి చుండ్రును సమర్థవంతంగా నివారించడంలో సహాయపడతాయి. ఉసిరికాయ జుట్టుకు సహజమైన కండీషనర్‌గా పనిచేస్తుంది. ఇది జుట్టును మృదువుగా మరియు మెరిసేలా చేస్తుంది. ఉసిరికాయ జుట్టు యొక్క సహజ రంగును కాపాడటానికి సహాయపడుతుంది , తెల్ల జుట్టును నివారిస్తుంది. ఉసిరికాయ స్కాల్ప్ యొక్క జూఊ స్థాయిని సమతుల్యం చేస్తుంది మరియు ఆరోగ్యకరమైన స్కాల్ప్‌ను ప్రోత్సహిస్తుంది. ంశ్రీబనీ ఖీవజీట "నోటి దుర్వాసనను తేలిగ్గా తీసుకుంటున్నారా? ఇది ఎంత ప్రమాదమో తెలుసా?" ఉసిరికాయ షాట్ ఎలా తయారు చేయాలి: ంఆఎఇఖీఏొఇఓఇఔ ఉసిరికాయ షాట్ తయారు చేయడానికి అనేక మార్గాలు ఉన్నాయి. ఇక్కడ రెండు సులభమైన పద్ధతులు ఉన్నాయి. వాటిల్లో ఒకటి ఉసిరికాయ జ్యూస్ రూపంలో తీసుకోవడం."అరటి పండు, బొప్పాయి పండు కలిపి తింటే జరిగేదిదే.. జాగ్రత్త!" 1. ఉసిరికాయ జ్యూస్ నుండి: కావలసిన పదార్థాలు: ఉసిరికాయలు – 4–5 నీరు – 1/2 కప్పు తేనె లేదా బెల్లం (రుచికి తగినంత) తయారీ విధానం: ఉసిరికాయలను కడిగి చిన్న ముక్కలుగా కట్ చేయండి. బ్లెండర్‌లో ఉసిరికాయ ముక్కలు మరియు నీరు వేసి బాగా బ్లెండ్ చేయండి. జ్యూస్‌ను వడకట్టి గ్లాసులో పోయండి. రుచికి తగినంత తేనె లేదా బెల్లం కలుపుకోండి. ఉదయం ఖాళీ కడుపుతో ఈ షాట్ తీసుకోండి. 2. ఉసిరికాయ పొడి నుండి: జనీబీ ఓజీఎ ంశ్రీబనీ ఒతిఎివ "విటమిన్ బి 12 లోపం ఉందా.. అయితే ఈ ఆరోగ్య సమస్యలు తప్పవు!" కావలసిన పదార్థాలు: ఉసిరికాయ పొడి – 1 టీస్పూన్ నీరు – 1 కప్పు నిమ్మరసం – కొన్ని చుక్కలు తయారీ విధానం: ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఉసిరికాయ పొడి వేసి బాగా కలపండి. కొన్ని నిమిషాలు అలాగే ఉంచండి. నిమ్మరసం కొన్ని చుక్కలు కలుపుకొని తాగండి. ఉదయం లేదా సాయంత్రం ఈ షాట్ తీసుకోండి. ఉసిరికాయ షాట్ తీసుకునే విధానం: ఉసిరికాయ షాట్‌ను రోజుకు ఒకసారి తీసుకోవడం మంచిది. ఉదయం ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. రుచి కోసం తేనె, బెల్లం లేదా కొద్దిగా నిమ్మరసం కలుపుకోవచ్చు. ప్రతిరోజు తీసుకోవడం వలన మంచి ఫలితాలు ఉంటాయి. ంటలవతీబితిబవఎవనిబి అయితే కొంతమందికి ఉసిరికాయ వల్ల ఎసిడిటీ సమస్యలు రావచ్చు. అలాంటప్పుడు వైద్య సలహా తీసుకోవడం మంచిది. గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు వైద్య సలహా తీసుకున్న తర్వాతే ఉసిరికాయ షాట్ తీసుకోవాలి. మధుమేహం ఉన్నవారు ఉసిరికాయ షాట్ తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. ఇతర ఉపయోగకరమైన చిట్కాలు: ఉసిరికాయ షాట్‌తో పాటు, మీరు ఉసిరికాయ నూనెను కూడా జుట్టుకు ఉపయోగించవచ్చు. ఇది జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తుంది మరియు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం మరియు తగినంత నీరు త్రాగడం కూడా జుట్టు ఆరోగ్యానికి చాలా ముఖ్యం. ఒత్తిడిని తగ్గించుకోవడం కూడా జుట్టు రాలడాన్ని నివారించడంలో సహాయపడుతుంది. ఉసిరికాయ షాట్ ఒక సహజమైన , ప్రభావవంతమైన పరిష్కారం. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మీరు ఆరోగ్యకరమైన , అందమైన జుట్టును పొందవచ్చు.





# సినిమా



## మహేష్-రాజమౌళి.. లిస్టులోకి మరో పవర్ఫుల్ స్టార్!



సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న 'SSMB29' సినిమా భారీ అంచనాలను రేకెత్తిస్తోన్న విషయం తెలిసిందే. ఈ యాక్షన్ అడ్వెంచర్ డ్రామా రూ. 1000 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కనుందని, భారతీయ సినిమా చరిత్రలో అత్యంత ఖరీదైన చిత్రాల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉందని సమాచారం. అలాగే సినిమా ఆఫ్రికా అడవుల నేపథ్యంలో సాగే ఇండియానా జోన్స్ స్టైల్ కథతో రూపొందుతోందని, రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ ఇదివరకే హింట్ ఇచ్చారు. ఇక సినిమా 2026లో విడుదల కానుందని అంచనాలు ఉన్నాయి. మహేష్ బాబు ఈ సినిమా కోసం జర్మనీలో ట్రెక్కింగ్ శిక్షణ తీసుకున్నాడు, హాలీవుడ్ యాక్టర్లు కూడా ఈ చిత్రంలో భాగం కావచ్చని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇక రాజమౌళి ఈ సినిమాను ఒక గ్లోబల్ ఫ్రాంచైజీగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాడని, అందుకోసం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం, 'SSMB29'లో ఒక కీలక పాత్ర కోసం బాలీవుడ్ నటుడు మాధవన్‌ను ఎంపిక చేశారని తెలుస్తోంది. ఈ పాత్ర గురించి ఇంకా వివరాలు బయటకు రాలేదు, కానీ ఈ పాత్ర మహేష్ బాబు క్యారెక్టర్‌తో క్లోస్‌లి కనెక్ట్ అవుతుందని టాక్ నడుస్తోంది. రాజమౌళి ఈ సినిమాలో మాధవన్‌ను ఒక ఇంటెన్స్ విలన్ లేదా మెంటార్ రోల్‌లో ఉపయోగించే అవకాశం ఉందని అభిమానులు ఊహిస్తున్నారు. మాధవన్ గతంలో 'రాకెట్రి'లాంటి సినిమాల్లో తన నటనతో మెప్పించాడు. ఈ సినిమాలో ఆయన భారతీయ సంస్కృతి, పురాణాలను ఆధారం చేసుకుని రూపొందుతున్న కథలో భాగం కావడం ఆసక్తికరంగా మారింది. రాజమౌళి ఈ సినిమాలో హాలీవుడ్ టెక్నాలజీ, భారతీయ కథానికలను కలపడం వల్ల మాధవన్ పాత్ర ఆకర్షణీయంగా ఉంటుందని అంటున్నారు. ఇక ఈ సినిమా భారీ ఎఈచీ, యాక్షన్ సన్నివేశాలతో గ్లోబల్ స్థాయిలో విడుదల కానుంది. మాధవన్‌ను ఎంపిక చేయడం ఈ సినిమాకు మరింత బలాన్ని చేకూర్చే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే పృథ్వీరాజ్ ఒక పవర్ఫుల్ పాత్రలో నటిస్తున్నట్లుగా క్లారిటీ వచ్చింది. ఇక ప్రియాంక చోప్రా హీరోయిన్ గా ఫైనల్.అయ్యింది. అయితే ఇంతవరకు జక్కన్న మాత్రం అఫీషియల్ క్లారిటీ అయితే ఇచ్చింది లేదు. మరి సినిమాకు సంబంధించిన సాలీడ్ అప్డేట్ ఎప్పుడు వస్తుందో చూడాలి.

## అఖిల్ పెళ్లి అంత సింపుల్ గా అందుకేనా?



సెలబ్రిటీల పెళ్లంటే ఏ రేంజ్ లో జరుగుతుందో చెప్పాల్సిన పనిలేదు. నెల రోజుల ముందు నుంచే హడావుడి మొదలవుతుంది. సోషల్ మీడియాలో వెడ్డింగ్ కార్డులు వైరల్ అవ్వడం....ఎవరెవర్నీ ఆహ్వా నించారు? ఎంత మంది పెద్ద స్టార్లు హాజరవుతున్నారు? ఏ చిత్ర పరిశ్రమ నుంచి ఏ నటుడు వస్తున్నాడు? ఇలా చాలా హంగామా ఉంటుంది నెట్టింట. పెళ్లి తేదీ దగ్గర పడే కొద్దీ ఆ హైప్ ఇంకా పెరుగుతుంది. చివరిగా మూడు రోజుల పెళ్లి ఓ రేంజ్ లో మారు మ్రోగుతుంది. తొలి రోజు హల్దీ, మెహందీ, సంగీత్ వంటి వేడుకలు ఉంటాయి. రెండవ రోజు వివాహం జరుగుతుంది. మూడవ రోజున భారీ ఎత్తున రిసెప్షన్ ఉంటుంది. కానీ అక్కినేని అఖిల్ పెళ్లి విషయంలో ఈ హడావుడి అంతా ఎక్కడా కనిపించలేదు. అసలు అఖిల్ పెళ్లి జరుగుతుంది? అన్న విషయమే బయటకు పొక్కలేదు. అఖిల్ వివాహం ముంబైకి చెందిన జైనబ్ రవ్జీతో ఎంతో నిరాడంబరంగా జరిగిన సంగతి తెలిసిందే. ఇండస్ట్రీ నుంచి కేవలం కొద్ది మంది అతిథులు మాత్రమే హాజరయ్యారు. అక్కినేని కుటుంబ సభ్యులు ...ఇంకా సన్నిహితులు... స్నేహితులు ఇలా అతి కొద్ది మంది సమక్షంలోనే వేడుక జరిగింది. పలువురు రాజకీయ ప్రముఖుల్ని కూడా ఆహ్వానించారు. అయితే ఆ విషయాలేవి బయటకు రాలేదు. అఖిల్ వివాహాన్ని నాగార్జున చాలా సింపుల్గా తేల్చేసారు. పెద్ద కుమారుడు నాగచైతన్య వివాహం మాత్రం భారీ ఎత్తున జరిగింది. కానీ అఖిల్ విషయంలో మాత్రం నాగ్ ఆ ఛాన్స్ తీసుకోలేదు. ఎంత వీలైంత అంత సింపుల్ గా కానిచ్చే సారు. తాను పెద్ద స్టార్ అని ....వేల కోట్లు ఆస్తులున్నాయనే పరపతిని చూపించుకోలేదు. అఖిల్ -జైనబ్ ఒకర్ని ఒకరు అర్థం చేసుకోవడానికి చాలా సమయం ఇచ్చారు. నిశ్చితార్థం తర్వాత పది నెలల పాటు సమయం ఇచ్చారు. అనంతరమే వివాహ వరకూ వెళ్లారు. అక్కినేని కుటుంబానికి పెళ్లిళ్లు అంతగా కలిసి రాలేదన్నది వాస్తవం. నాగచైతన్య తొలుత సమంతను వివాహం చేసుకోవడం విడిపోవడం తెలిసిందే. అలాగే నాగార్జున మేనల్లుడు, నటుడు సమంత్ కూడా కీర్తి రెడ్డిని వివాహం చేసుకుని విడిపోయారు. రెండవ పెళ్లి చేసుకునే ఆలోచన లేనట్లు వెల్లడించారు. మేన కోడలు సుప్రియ కూడా వివాహానికి దూరంగానే ఉన్నారు. నాగార్జున కూడా అమలను రెండవ వివాహం చేసుకున్నారు. తొలుత నాగార్జున రామానాయుడు కుమార్తెను వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే.



## ఆరెక్స్ హీరో మరీ ఇంత గ్యాప్ ఎలా..?



ఆరెక్స్ 100 హీరో కార్తికేయ 2023 లో బెదురులంక, 24లో భజే వాయు వేగం సినిమాలతో సక్సెస్ అందుకున్నాడు. రెండు హిట్లు కొట్టాక కూడా కార్తికేయ ఇంకా ఎందుకో డైలమాలో ఉన్నట్టు అనిపిస్తుంది. కెరీర్ విషయంలో కాస్త టెన్షన్ అవసరమే కానీ అది ఫ్లాపులు పడిన టైం లో నెక్స్ట్ సినిమాతో ఎలాగైనా హిట్టు కొట్టాలన్న ఆలోచనతో ప్లానింగ్ తో ఉండాలి. ఆల్రెడీ సక్సెస్ ఫాం లో ఉన్నప్పుడు లేట్ చేస్తే అది కాస్త రివర్స్ అవుతుంది. కార్తికేయ 2021 లో చావు కబురు చల్లగా, రాజా విక్రమార్క సినిమాలు చేశాడు. ఆ రెండు సినిమాలు అతనికి షాక్ ఇచ్చాయి. ఐతే ఆ తర్వాత కోలీవుడ్ లో అజిత్ కి విలన్ గా ఒక అటెంప్ట్ చేశాడు. కానీ అది అతని కెరీర్ కి హెల్ప్ అవ్వలేదు. ఫైనల్ గా బెదురులంక 2012 అంటూ ఒక ప్రాజెక్ట్ చేసి హిట్ కొట్టాడు. ఆ సినిమాతో కార్తికేయ కొత్త జోష్ ఏర్పరచుకున్నాడు. ఆ నెక్స్ట్ వెంటనే భజే వాయు వేగంతో మరో సక్సెస్ అందుకున్నాడు. ఈ రెండు సినిమాలు కార్తికేయ స్టోరీ సెలక్షన్ ఏంటన్నది తెలియచేశాయి. ఐతే భజే వాయు వేగం వచ్చి ఏడాది అవుతుంది. కార్తికేయ నెక్స్ట్ ఏ సినిమా చేస్తున్నాడు అన్నది అసలు క్లారిటీ లేదు. సైలెంట్ గా ఏదైనా సినిమా చేస్తున్నాడా అన్నది తెలియాల్సి ఉంది. ఐతే ఈసారి కూడా ఒక మంచి కథతో పక్కా ఆడియన్స్ ని మెప్పించే సినిమాతో వస్తాడని అంటున్నారు. ఐతే సినిమా ఆల్రెడీ చేస్తుంటే ఓకే కానీ ఇంకా కథల వేటలో ఉంటే మాత్రం కార్తికేయ వెనకపడినట్టే అవుతుంది. సక్సెస్ ఫాం లో ఉన్నప్పుడు హిట్లు ఫ్లాపులు లెక్క చూడకుండా సినిమాలు చేస్తూ వెళ్లాలి. మరీ మార్కెట్ లేదు అనుకున్న టైం లో సొంత టాలెంట్ చూపించేలా సినిమాలు చేయాలి. మరి కార్తికేయకి ఎవరు గైడెన్స్ ఇస్తున్నారో తెలియదు కానీ అతని సినిమాల వేగం మాత్రం తప్పకుండా పెంచాలి. యువ హీరోగా ఒక ఏడాదిలో రెండు సినిమాలు చేస్తే బాగుంటుంది. అలా కాకుండా ఆలోచిస్తూ కూర్చుంటే మాత్రం తన ప్లేస్ వెనక్కి జరుగుతూ ఉంటుంది. మరి ఈ పరిణామాలను కార్తికేయ గుర్తిస్తే బెటర్ అని చెప్పొచ్చు.

## 2026-27 సీజన్ మోస్ట్ అవైటెడ్ సినిమాలు



2026-2027 సీజన్ భారతీయ సినీపరిశ్రమలో అతిపెద్ద సినిమాలతో సందడి చేయనుంది. ముఖ్యంగా పురాణేతిహాసం 'రామాయణం' ఆధారంగా 'దంగల్' ఫేం నితీష్ తివారీ తెరకెక్కిస్తున్న రామాయణం -1, రామాయణం -2 ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్నాయి. ఈ సినిమాల రాక కోసం ప్రపంచం ఎంతో ఆసక్తిగా వేచి చూస్తోంది. దీనికి కారణం ఈ సినిమా కోసం ఎంపిక చేసుకున్న తారాగణం. దేశంలోని బిగ్గెస్ట్ స్టార్స్ ఈ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాని స్వయంగా నిర్మిస్తూ, ఇందులో రావణాసురుడి పాత్రలో నటిస్తున్నాడు కేజీఎఫ్ యష్. దాదాపు 400కోట్ల బడ్జెట్ తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు యష్ అన్నీ తానే అయ్యాడు. ఎంపిక చేసుకున్న కాస్టింగ్ కూడా ఆసక్తిని పెంచుతోంది. ఇప్పటికే 70రోజుల పాటు రావణాసురుడి పాత్రపై చిత్రీకరణ సాగిందని కథనాలొచ్చాయి. అంటే రాముడు, లక్ష్మణుడు, సీత, రావణాసురుడి పోర్షన్లపై చాలా సన్నివేశాలు తెరకెక్కాయి. ఇటీవలే యష్‌తో పాటు ఇంద్రదేవ్ పాత్రను పోషిస్తున్న కునాల్ కపూర్ కూడా సెట్స్‌లో చేరాడని తెలిసింది. అంటే రావణ్ తో ఇంద్రదేవుని పోరాటాలను తెరకెక్కించారు. సైఫ్ తో కలిసి 'జువెల్ థీఫ్' సినిమాలో కునాల్ నటనకు మంచి పేరొచ్చింది. అతడు రామాయణంకి ప్లస్ అవుతాడని అంచనా.ఈ చిత్రంలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తుండగా, సన్నీడియోల్ ఆంజనేయుడి పాత్రను పోషిస్తున్నారు. 2026 దీపావళికి తొలి భాగం విడుదలవుతుంది. 2027లో రెండో భాగం విడుదలవుతుంది. బుల్లితెరపై ఎన్నోసార్లు రామాయణం తెరకెక్కింది. ప్రతిసారీ ప్రజలు ఆదరించారు. పెద్ద తెరపైనా రామాయణం సినిమాలు అలరించాయి. దిగ్గజ దర్శకులు రామాయణ కథల్ని అందంగా తెరకెక్కించి ప్రజల మన్ననలు పొందారు. వాటన్నిటికీ భిన్నంగా ఇప్పుడు మారిన టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని, అవెంజర్స్, అవతార్ రేంజులో నితీష్ ఈ సినిమాని రూపొందించాలని అభిమానులు కోరుకుంటున్నారు. నితీష్ ఫోకస్ రావణ-రాముడి పోరాటాలు, యుద్ధాలపైనా? ఏమోషన్స్ పైనా? అన్నది వేచి చూడాలి.

## క్లిక్ అయితే వసూళ్ల వర్షం.. 'కుబేర'తో వారికి ఊపిరి!

: కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, టాలీవుడ్ కింగ్ నాగార్జున లీడ్ రోల్స్ లో కుబేర మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్ పి అమిగోస్ క్రియేషన్స్ బ్యానర్ పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. నేషనల్ క్రష్ రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తుండగా, రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. కుబేర మూవీ ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసుకుంది. ఇటీవల సెన్సార్ ఫార్మాలిటీస్ కూడా కంప్లీట్ అయ్యాయి. యూ/ఏ సర్టిఫికెట్ అందుకుంది. ప్రస్తుతం మేకర్స్.. సినిమాను ప్రమోట్ చేసే బిజీలో ఉన్నారు.తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జూన్ 20వ తేదీన గ్రాండ్ గా కుబేర రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పటికే వచ్చిన షెడ్యూల్ ప్రకారం.. జూన్ 12వ తేదీన హరిహర వీరమల్లు రిలీజ్ కావాల్సి ఉంది. జూన్ 27వ తేదీన కన్నప్ప విడుదల కానుంది. రెండూ పెద్ద మూవీలు కనుక.. కుబేర గట్టి పోటీ మధ్య రిలీజవుతుందని అంతా అనుకున్నారు. అదే సమయంలో జూన్ నెల మొత్తం పాన్ ఇండియా చిత్రాలతో సందడి ఉంటుందనుకుంటే.. రీసెంట్ గా విడుదలైన కమల్ హాసన్ థగ్ లైఫ్ నిరాశపరిచింది. ఆ తర్వాత రిలీజ్ అవ్వాల్సిన వీరమల్లు వాయిదా పడింది. ఇప్పుడు కుబేరపైనే భారం వేశారు తెలుగు రాష్ట్రాలు ఎగ్జిబిటర్స్. సినిమా కోసం ఎదురుచూస్తున్నారు. జూన్ అంతా థియేటర్స్ కళకళలాడుతాయని భావించిన వారికి థగ్ లైఫ్ తో అలా.. వీరమల్లుతో ఇలా షాక్ తగిలింది. అందుకే కుబేరతో ఊపిరి పీల్చుకుందామని చూస్తున్నారు. అయితే ఇప్పటికే



కుబేరపై ఆడియన్స్ లో మంచి అంచనాలు ఉన్నాయి. సూపర్ బజ్ క్రియేట్ అయ్యి ఉంది. మూవీ సూపర్ హిట్ పక్కా అని అంతా ఫిక్స్ అయ్యారు. రీసెంట్ గా వచ్చిన ట్రైలర్ ఆకట్టుకుంది. అందులో క్లియర్ గా రివీల్ చేసిన సినిమా స్టోరీ లైన్ మెప్పిస్తుంది. లీడ్ రోల్స్ కు ఉన్న క్రేజ్.. శేఖర్ కమ్ముల టాలెంట్.. దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్.. మూవీ నేపథ్యం.. అలా అన్ని అంశాలు కూడా ఆడియన్స్ ను ఫిదా చేశాయి. దీంతో కంటెంట్ బాగుంటుందని సినీ ప్రియులు అనుకుంటున్నారు. అయితే పాజిటివ్ టాక్ వస్తే మాత్రం వసూళ్ల వర్షమే. మరేం జరుగుతుందో వేచి చూడాలి.

విజయ సారథి



# రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన ద్వారకా



తిరుమల జూన్ 9:ద్వారకా తిరుమల మండలం నారాయణ పురం గ్రామంలో సోమవారం తేదీ 9/6/2025 న వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం లో భాగంగా ముందస్తు ఖరీఫ్ కార్యక్రమం కె.వి.కె విస్తరణ అధికారి డాక్టర్. వి దీప్తి. అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు కొబ్బరి, కోకో, ఆయిల్ఫామ్ మరియు అపరాలు పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు గురించి, అలాగే పత్ర ఆకు మరియు భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఆయిల్ ఫామ్ లో కోకో ని అంతర పంటగా నాటుకునే విధానం మరియు సమగ్ర ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు.విత్తనశుద్ధి, వేసవిలో లోతు దుక్కులు, మినుము పంట సాగు సమయంలో జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టలు వినియోగం గురించి వివరించారు. రైతులు కృషి విజ్ఞాన కేంద్రం యొక్క సేవలను వినియోగించుకోవాలని అలాగే కె.వి.కె గ్రామీణ యువత కి నిర్వహించే స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్. రామచంద్రుడు గారు రైతులతో ముఖాముఖి చర్చ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఏ దుర్గారమేష్,గ్రామ సహాయ అధికారి నిహారిక, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. అనంతరం ఆయిల్ ఫామ్ క్షేత్రాన్ని సందర్శించి మొవ్వ కుళ్ళ,కాండం కుళ్ళు ని గమనించి తగిన సూచనలు అందజేశారు.

### భీమవరం అల్లూరి సీతారామరాజు

### సంస్కృతివనంలోయోగాకార్యక్రమం ఘనంగా నిర్వహించారు...

.భీమవరం జూన్ 09 జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి యోగాంధ్ర -2025లో భాగంగా పర్యాటక ప్రాంతంలో యోగా పేరిట సోమవారం భీమవరం అల్లూరి సీతారామరాజు స్మృతి వనం నందు ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు. అంతర్జాతీయ క్రీడాకారిణి మరియు యోగ మాస్టర్ ట్రైనర్ బి.శిరీష యోగా విశిష్టతను వివరిస్తూ చెప్పిన యోగాసనాలు అభ్యసన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య ఆంధ్ర సాకారం దిశగా వడివడిగా అడుగులేస్తూ ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకుంటోందన్నారు. భారతీయ వారసత్వ సంపద అయిన యోగ విశిష్టత ను గుర్తించి ఐక్యరాజ్య సమితి 2014 జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవంగా ప్రకటించగా అప్పటి నుండి అంతర్జాతీయ యోగ దినోత్సవాలను జరుపుకున్నామన్నారు. జూన్ 21 న జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైజాగ్ లో జరిగే యోగ కార్యక్రమంలో ప్రధాన మంత్రి పాల్గొననున్న నేపథ్యంలో ఆ రోజున రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది ప్రజలు భాగస్వాములు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు నివ్వడం జరిగిందన్నారు. దీనిలో భాగంగానే గత నెల 21వ తేదీ నుంచి నెల రోజుల పాటు యోగాంధ్ర క్యాంపెయిన్ ను రాష్ట వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు యోగ శిక్షణ కార్యక్రమాలు, కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో కూడా యోగ రోడ్డు ను ఏర్పాటు చేసి ప్రతి రోజూ యోగ సాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వర్గాన్ని యోగాంధ్రలో భాగంచేసే లక్ష్యంతోనే థీమ్ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గ్రామం, పట్టణాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇదే విధంగా పర్యాటక ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, యోగా ఔన్నత్యాన్ని చాటిచెప్పేందుకు జిల్లాలో ఇప్పటికే వశిష్ట గోదావరి వలందలరేవు, పెనుగొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణం పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించామని, ఈ రోజున సుమారు రెండు వేల మందితో అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వద్ద యోగ కార్యక్రమాన్ని జరుపుకోవడం . ఈ నెల 16వ తేదీన పేరుపాలెం బీచ్ లో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. 19వ తేదీన భీమవరం పట్టణం నందు సుమారు ఐదు వేల మంది స్పోర్ట్స్ పర్సన్స్, అథ్లెటిక్స్ తో ప్రత్యేక యోగ కార్యక్రమాన్ని జరుపుకోనున్నట్లు తెలిపారు. జిల్లాలో కనీసం పది లక్షల మందిని యోగాసనాల కార్యక్రమంలో భాగస్వాములు చేసే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక యోగా ట్రైనర్లతో పెద్దఎత్తున యోగాసనాల శిక్షణ కార్యక్రమాలుజరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తన దైనందిన జీవితంలో యోగ ను భాగంగా చేసుకుని 45 నిమిషాల పాటు యోగాను రోజూ ఆచరించినట్లైతే జీవితాంతం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండొచ్చన్నారు. యోగ అభ్యసనాలు అనంతరం అల్లూరి సీతారామరాజు విగ్రహం నుండి అడ్డ వంతెన వరకు యోగ అవగాహన ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డిఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, ఏఎస్ఆర్ సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు, ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ హరి శ్రీనివాస్, యోగ సాధకులు యు.వెంకటేశ్వరరాజు, పి.భవాని, పి.రోహిణి, ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




# విద్యార్థుల ప్రతిభకు ఉత్తమ పురస్కారాలు

నంద్యాల(విజయ సారథి):టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థుల ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డులను ప్రకటించిందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం చాబోలు రోడ్డులోని ఎఎస్ఆర్ కళ్యాణ మండలంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు జిల్లా స్థాయి షైనింగ్ స్టార్స్ ప్రతిభా అవార్డుల పురస్కారం-2025 కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్, ఎంపిపి ప్రభాకర్ రెడ్డి, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ప్రేమాంత్ కుమార్, జిల్లా విద్యాధికారి జనార్ధన్ రెడ్డి, జిల్లా అధికారులు, విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ప్రోత్సహించడానికి షైనింగ్ స్టార్స్ అవార్డు-2025 పేరిట సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రతి అవార్డు గ్రహీతకు పతకం, రూ.20 వేల నగదు బహుమతి, అప్రిసియేషన్ సర్టిఫికెట్‌తో సత్కరించాన్నారు. విద్యలో నాణ్యత, నైపుణ్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా 182 మంది టెన్త్ విద్యార్థులకు, ప్రభుత్వ, ప్రైవేట్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ, ఒకేషనల్ విభాగాల్లో అత్యధిక మార్కులు సాధించిన 35 మంది ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రధానం చేస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ/ప్రైవేటు పాఠశాలలో చదివిన విద్యార్థులనే భేదభావం లేకుండా పదవ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో మంచి మార్కులు సాధించిన వారిని ప్రోత్సహించడం జరిగిందన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి విద్యార్థులను మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు అధిగమించాలన్నారు. 10వ తరగతిలో జిల్లాలో 82 శాతం ఉత్తీర్ణత సాధించడం ద్వారా రాయలసీమ జిల్లాలలో నంద్యాల జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టడం జరిగిందన్నారు. అదే విధంగా విద్యార్థుల్లో సాంకేతికతను పెంచడానికి నాక్ విద్యా విధానాన్ని కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి హయాంలో ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్య శిక్షణ వైపు కూడా దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పాదయాత్ర సమయంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయాలని కోరగా అందుకు తగిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి అలోచనల మేరకు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించేందుకు గాను ప్రతి జిల్లాలో పెద్ద ఎత్తున షైనింగ్ స్టార్స్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేయడమే కాకుండా ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలనే తారతమ్యం లేకుండా కేవలం ప్రతిభనే కొలమానంగా తీసుకుంటూ విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నతస్థాయికి వెళ్లేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అందుకు తగ్గ కృషి

### విద్యార్థులను ప్రోత్సహించేందుకు షైనింగ్ స్టార్స్ అవార్డు.

### - 182 మంది టెన్త్ విద్యార్థులకు, 35 మంది ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రధానం

### పట్టుదల, కృషితో ఉన్నత స్థానాలను అధిరోహించండి

### రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్




చేయాలన్నారు. విద్యార్థులు కోర్ సబ్జెక్టు తో పాటు ఇతర నైపుణ్య మెలకువలను కూడా అభివృద్ధి చేసుకోవడం ద్వారా విద్యార్థులో నాయకత్వ లక్షణాలు అలవర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను అన్ని విధాలుగా ఉత్సాహపరుస్తూ ఏ ఒక్క పరీక్షలో తప్పినా వారిని నిరుత్సాహపరచకుండా వెన్ను దట్టి ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో విద్యార్థినిల ఉత్తీర్ణత 60 శాతం పైగా ఉందని మరింత పెంచేందుకు కూడా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదే విధంగా పదవ తరగతిలో తప్పిన పిల్లలకు కూడా అవసరమైన సహాయ సహకారాలను అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు కూడా వారి ప్రతిభను దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు ఉపయోగపడేలా కృషి చేయాలన్నారు.అంతకుముందు విద్యార్థులు, తల్లిదండ్రులు వారి మనోభావాలను పంచుకున్నారు. అనంతరం విద్యార్థులకు మంత్రి, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికేట్, మెడల్, 20వేల నగదు బహుమతిని అందజేశారు.

# నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర శ్రామికుడు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.

### జనసేన పార్టీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్





తాడేపల్లిగూడెం, జూన్9: పశ్చిమగోదావరి జిల్లా,తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధికి రాష్ట్ర విప్ తాడేపల్లిగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ నిరంతరం శ్రామికుల వలె పనిచేస్తున్నారని జనసేన పార్టీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ స్పష్టం చేశారు.తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణంలో జరుగుతున్న తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సహాయం దాతల విరాళాలతో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను జనసేన పార్టీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సువిసాలమైన హైస్కూల్ గ్రౌండ్ ను నియోజకవర్గ ప్రజలకు ఏ విధంగా వినియోగించాలన్న కృతనిశ్చయంతో ఎమ్మెల్యే పని చేస్తున్నారని ఆయన అన్నారు. జడ్.పి హై స్కూల్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ శాసనసభ్యులు శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ పూర్తి సహాయ సహకారాలతో జరుగుతున్న అభివృద్ధి పనులైన వాకింగ్ ట్రాక్, వాలీబాల్, కబాడీ, షటిల్ కోర్ట్, లాంగ్ జంప్, ఫుట్బాల్, ఆర్. ఓ ప్లాంట్, కళాకారులకు స్టేజి రెండు రూములు, మరిన్ని అభివృద్ధి పనులు ఎన్.వి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గ అభివృద్ధికి, తరతరాలకు ఉపయోగపడే పనులను చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ చేస్తున్న పనులు చరిత్రలో నిలిచే విధంగా ఉన్నాయని వారి చేస్తున్న పనులకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడుతున్న వారికి బుద్ధి చెప్పే రోజు దగ్గరలో ఉందని జనసేన పార్టీ యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్ వి సత్యనారాయణ, నీలపాల దినేష్ యాదవ్, గొర్ల మహారాజు, సుంకర గంగాధర్, శిల సత్తిబాబు, ఐ.శివ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు,

# జిల్లా వడ్రంగి పనివారల సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

### కార్పెంటర్ల సమస్యలను పరిష్కరిస్తాం .. రాజ్యసభ సభ్యులు పాక




భీమవరం జూన్ 09: పశ్చిమ గోదావరి జిల్లా వడ్రంగి పనివారల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం భీమవరం మార్కెట్ యార్డులో నిర్వహించారు. అధ్యక్షులు చిట్టిమోజు భోగేశ్వరరావు, కార్యదర్శి చిప్పాడ చంద్రశేఖర్, కోశాధికారి లక్కోజు సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షులు అరసవల్లి రామచంద్రరావు, వెంకటపు శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులు చింతోజు పాండు రంగాచార్యులు, ములగాడ ప్రసాద్ కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొని మాట్లాడారు. వడ్రంగి పనివారల సభ్యులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తాయని, సంక్షేమ పథకాలను అందిస్తామని అన్నారు. అధ్యక్ష, కార్యదర్శులు భోగేశ్వరరావు, కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్పెంటర్ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామని, రాష్ట్రంలో 24 లక్షల మంది కార్పెంటర్ లున్నారని, కరోనా సమయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నామని, ప్రభుత్వం ఏ సహాయము చేయలేదన్నారు. రాష్ట్రంలో మా కార్పెంటర్లకు చికిత్స ల నిమిత్తం ఆరోగ్యశ్రీలో వైద్యం చేచేయించి ప్రభుత్వం ఆర్థికంగా అదుకోవాలన్నారు. 24 లక్షల మంది కార్పెంటర్స్ ఉన్న రాష్ట్ర సంఘానికి కార్పొరేషన్ ఇచ్చి దాని ద్వారా సబ్సిడీలోన్లు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చిట్టి మోజు భోగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి. చిప్పాడ చంద్రశేఖర్, కోశాధికారి.లక్కోజు వెంకట సుబ్రహ్మణ్యం. ఉపాధ్యక్షులు. చినీ తోజు. పాండురంగాచార్యులు, మూలగాడ ప్రసాద్, సహాయ కార్యదర్శిలు జమితార హరికృష్ణ, మేదూరి వీర వెంకట సత్యనారాయణ మూర్తి, చల్లిపల్లి రాంబాబు, బల్లంకి ఆచారి అనుపోజు బాలదుర్గ ప్రసాద్, పోతబత్తుల దుర్గాప్రసాద్, క్రమశిక్షణ కమిటీ. గుగ్గిలపు శ్రీనివాస్, వల్లూరి రామకృష్ణ, తా తోలు పాండురంగాచారి, పొన్నాడ సత్యనారాయణ, మంకు సత్యనారాయణ తదితర వడ్రింగ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు...

# విద్య జీవితంలో ముఖ్యమైన ఘట్టం

### షైనింగ్ స్టార్స్ గా ప్రతిభా పురస్కారాలను అందుకోవటంలో విద్య కీలకమైన అంశం

### 119 మంది పదో తరగతి, 34 మంది ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ -25 ప్రతిభా పురస్కారాలను అందించిన జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు




భీమవరం జూన్ 09: విద్య అనేది మనందరి జీవితంలో ముఖ్యమైన ఘట్టమని, విద్యావంతులుగా ఉండటం మనకి సమాజంలో గౌరవాన్ని కలిగిస్తుందని, షైనింగ్ స్టార్స్ గా ప్రతిభా పురస్కారాలను విద్యార్థులు అందుకోవటంలో విద్య కీలకమైన అంశమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న షైనింగ్ స్టార్స్ -25 ప్రతిభా పురస్కారాలను 153 మంది పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు రూ 30 లక్షల 60 వేలను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నేడు సమాజం అభివృద్ధిలో వెనుకబాటుతనానికి కారణం అందరూ విద్యను అభ్యసించకపోవడమేనని, అందరూ విద్యావంతులైతేనే సమాజం అభివృద్ధి పథంలో ఉంటుందన్నారు. జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలంటే విద్య ముఖ్యమైన సాధనమని, అటువంటి విద్యను విద్యార్థులు ఏ విధమైన ఆటంకాలు లేకుండా అందుకోవటంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అందరిని బడికి పంపించడం ఒక ఎత్తు అయితే అలా బడికి వచ్చిన విద్యార్థులను ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దటం ఉపాధ్యాయుల కర్తవ్యమని అన్నారు. సామాజిక రుగ్మతలను రూపుమాపటంలో విద్య క్రియాశీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు (అంజిబాబు) మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల, కళాశాలలోని విద్యార్థులు షైనింగ్ స్టార్స్-25 పురస్కారాలను అందుకోవడం గొప్ప విశేషమని అన్నారు. ఒక్కొక్కరికి రూ 20 వేలు చొప్పున పదో తరగతి 119 మంది విద్యార్థులకు రూ 23 లక్షల 80 వేలు, జూనియర్ కళాశాలలో 34 మంది విద్యార్థులకు రూ 6 లక్షల 80 వేలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, నేడు విద్యకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. విద్య కనబడిన విత్తనమని, తల్లిదండ్రులు ఎంత కష్టమైన ఇబ్బందులైన పిల్లలను చదివించాలని ఎమ్మెల్యే అంజిబాబు కోరారు. కార్పొరేట్ స్కూల్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య బోధన సాగుతుందని అన్నారు. రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ మాట్లాడుతూ చదువుతోపాటు జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, తల్లిదండ్రులు పోటీ ఆలోచనను విరమించుకోవాలని అన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, అన్ని రంగాలు సమాజంలో ఉన్నాయని అన్నారు. అనంతరం 153 మంది పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ - 25 ప్రతిభ పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో డీఈవో నారాయణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## టౌన్ మోడల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ గా బాధ్యతలు చేపట్టిన పద్మావతి



కర్నూలు(విజయ సారథి): కర్నూలు నగరంలోని ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలకు కోడుమూరులో విధులు నిర్వహిస్తున్న పద్మావతి బదిలీపై కర్నూలు బాలుర కళాశాలకు ప్రిన్సిపల్ గా వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం వారు పదవీ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది తదితరులు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తిరుపతి జిల్లా పోలీస్ స్టేషన్ పరిధిలో యోగ అవగాహన ర్యాలీ నిర్వహించిన డీఎస్పీ ప్రసాద్.




తిరుపతి(విజయ సారథి):తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాల మేరకు తిరుచానూరు పోలీస్ స్టేషన్ నుంచి తిరుచానూరు బ్రిడ్జ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించిన డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి అనారోగ్య సమస్యలు మైగ్రేన్ తలనొప్పి కీళ్ల నొప్పులు మనోవేదన నుంచి దూరం చేస్తుంది అందరూ కూడా తమ ఆరోగ్యం కోసం యోగాని ఈరోజు చేస్తే మంచిదని తెలిపారు ఈ కార్యక్రమంలో తిరుచానూరు సిఐ సునీల్ కుమార్. ఎస్సై జగన్నాథం. ఎస్సైసాయినాథ్ చౌదరి. ఎస్సై అరుణ. తిరుచానూరు పోలీస్ సిబ్బందితోపాటు ప్రజలందరూ కూడా పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు
## ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు
### పులిచెర్ల మండలంలో విస్తృత సోదాలు




చిత్తూరు(విజయ సారథి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా జూన్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం పులిచెర్ల మండలం కల్లూరు, చల్లవారిపల్లి, జెండా మాను,జ్యోతి నగర్, మటుకువారిపల్లె, ప్రాంతాల్లోని స్టోన్ క్రషర్లు, ఇటుక బట్టీలు, కోళ్ల ఫారాలు, హోటళ్ళు, షాపుల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలను అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జగదీష్ బాబు, తో పాటు గ్రేట్ విజన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జి.వి.సుబ్రహ్మణ్యం బాబు మండల విద్యాశాఖాధికారి తాతయ్య,మరియు సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, వారు పర్యవేక్షించారు. విద్య, పోలీసు, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ఈ కార్యాచరణను నిర్వహించారు. బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం 1986 ఈ చట్టం బాల కార్మికులు నియామకాన్ని నియంత్రిస్తుంది మరియు కొన్ని ప్రమాదకరమైన వృత్తులు 14 సంవత్సరాల పిల్లలను పనులు లో పెట్టుకోవడం నిషేధం. 2016 చట్టాన్ని సవరణ చేసి దీని ప్రకారం పెద్ద సంస్థల్లో ఏ రకమైన పనిలో నియమించుకోవడం నిషేధించబడింది.అని చెప్పారు. బాల కార్మికులను గుర్తించి పనిలో పెట్టుకున్న యజమానులపై చట్టపరమైన చర్యలు ప్రభుత్వం చేపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ వార్డెన్ నవీన్ కుమార్ జడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ మహమ్మద్ రఫీ అంగన్వాడి సిబ్బంది మహిళా పోలీస్ సుమలత మరియు వర్తకులు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యోగా గురించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

**ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలందరూ పాల్గొనాలి**
**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్**
**నగరంలోని 65వ వార్డు సచివాలయం పరిధిలో యోగాంధ్ర ర్యాలీలో పాల్గొని ఇంటింటికి వెళ్లి యోగా గురించి అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్**




అనంతపురం(విజయ సారథి):యోగా గురించి ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం నగరంలోని 65వ వార్డు సచివాలయం పరిధిలో నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి యోగా గురించి జిల్లా కలెక్టర్ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలందరూ పాల్గొనాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగా చేయాలన్నారు. యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, యోగాంధ్ర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామస్థాయిలో, వార్డు స్థాయిలో, హాబిటేషన్ల స్థాయిలో, అన్ని నివాస ప్రాంతాలలో ర్యాలీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి సచివాలయ స్థాయిలో సచివాలయ ఉద్యోగులు ఆ సచివాలయం పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రజలకు యోగా గురించి అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీలను నిర్వహించడం జరిగిందని, ప్రతి ఒక్కరూ యోగాని ప్రాక్టీస్ చేయాలని వారికి తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ డా.పావని, ఎస్ఈ చంద్రశేఖర్, తహసీల్దార్ హరికుమార్, స్థానిక కార్పొరేటర్లు చంద్రమోహన్ రెడ్డి, శేఖర్ బాబు, ఫుడ్ కంట్రోల్ అధికారి, ఆయుష్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పరుచూరి పూర్ణచంద్రరావు సహకారంతో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ



అమరావతి(విజయ సారథి):గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా ఉండకూడదని ప్రతి నెల గర్భిణీ స్త్రీలకు బలమైన పౌష్టికాహారం జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ పంపిణీ చేయడం అభినందనీయమని అమరావతి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎం హరిబాబు అన్నారు.మండల కేంద్రమైన అమరావతిలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పెదకూరపాడు మండలం బుచ్చియ్యపాలెం గ్రామ మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు సహకారంతో సోమవారం గర్భిణీ స్త్రీలు స్కానింగ్ కు,వివిధ పరీక్షల నిమిత్తం వచ్చిన మహిళలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.ఈసందర్భంగా తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ఇంటి వద్ద కూడా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, వివిధ గ్రామాల నుండి వచ్చే గర్భిణీ స్త్రీలు ఆకలితో ఇబ్బందులు పడకుండా ఉండాలనే మంచి ఉద్దేశంతో పౌష్టికాహారాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన పూర్ణచంద్రరావు అభినందనీయులనీ అన్నారు.గర్భిణీ స్త్రీలు డాక్టర్ల సూచనలను పాటిస్తే ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిచ్చే అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు,జన చైతన్య సమితి ప్రతినిధులు గంజిమాల విజయ్ బాబు, బెజ్జం నాగేశ్వరరావు, సమాచారం సిబ్బంది వేకల శ్రీనివాసరావు,షేక్ శంషుద్దీన్, ఎడ్లూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.జన చైతన్య సమితి నిర్వాహకులు గర్భిణీస్త్రీలకు పెరుగన్నం, కోడిగుడ్లు,డ్రైఫ్రూట్స్ లడ్డులు,అరటి పళ్ళు,శనగ విత్తనాల లడ్డులు పంపిణీ చేశారు.

## పెనుగొండ లో యోగాంధ్ర పై అవగాహన ర్యాలీ

పెనుగొండ జూన్ 9 :పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం యోగాంధ్ర పై అవగాహన ర్యాలీ పట్టణంలో నిర్వహించారు ఎంపీడీవో టి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతినిత్యం యోగా అభ్యాసం చెయ్యాలని అన్నారు యోగా చేయడం వలన మనం ఆరోగ్యాన్ని పెంపొందించుకుంటామని అలాగే ఎటువంటి అనారోగ్యాల బారిన పడకుండా యోగా అనేది ఉపయోగపడుతుందని అన్నారు పిల్లలు పెద్దలు యోగా




అభ్యాసించాలని కోరారు ఈ ర్యాలీలో ఎంపీడీవో టి సూర్యనారాయణమూర్తి సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఉన్నత విద్య, ఉజ్వల భవిష్యత్తుకు ప్రోత్సాహకాలు.. షైనింగ్ స్టార్స్ అవార్డులు..!

**జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్.చెరుకూరి**
**షైనింగ్ స్టార్ - 2025 అవార్డు క్రింద జిల్లాలో మొత్తం 266 మందికి**
**రూ.20 వేలు చొప్పున.. మొత్తం రూ.53,20,000 లు విడుదల**

కడప(విజయ సారథి):రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "షైనింగ్ స్టార్స్-2025" అవార్డులు విద్యార్థుల ఉన్నత చదువులు, ఉజ్వల భవిష్యత్తుకు ప్రోత్సాహాన్ని అందిస్తాయని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సోమవారం కడపలోని మాధవి కన్వెన్షన్ హాలులో 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్-2025 పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ 20 వేల నగదు బహుమతి, సత్కారం చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జేసీ అదితిసింగ్, ఎమ్మెల్సీలు ఎం.వి. రామచంద్రారెడ్డి, బి.రాంగోపాల్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ కో.అపరేటివ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ జయప్రకాష్ లు హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అభ్యసనం, కృషి, పట్టుదల ఆశయాలకు ఈ రోజు రెక్కలు వచ్చిన రోజు అని అభివర్ణించారు. ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ ఒక్కో ప్రతిభ ఉందని, ఆశయం ఏదైనా కావచ్చుని, ఆ రంగంలో నిష్ణాతులుగా ఎదిగి ప్రపంచ చరిత్రలో మన పేరు లిఖించబడాలి అన్న ఆశయంతో ముందుకు సాగాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం కష్టం కాదని, లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రణాళిక ప్రకారం, దృఢ సంకల్పంతో అడుగులేయలన్నారు. మనం ఎప్పుడూ నిత్య విద్యార్థిని అనే భావనతో ముందుకు సాగాలన్నారు. మన ఇంటి కోసం, మన సొంతం కోసమే కాకుండా మనతో పాటు సమాజం కోసం కూడా పాటుపడుతూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. మనతో పాటు మన ఇల్లు, మన గ్రామం, మన జిల్లా అనే దృక్పథంతో నడవాలన్నారు. మన విజయానికి చేయుతను ఇచ్చిన వారిని భవిష్యత్తులో ఎన్నడూ మారువకూడదన్నారు. మీ లక్ష్యాలను ఎప్పుడు కూడా.. వెనుకంజలో నడిపించకూడదు అని సూచించారు. అదే విధంగా ఈ రోజు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆలోచించి.. పిల్లలో ప్రతిభను వెలికి తీయాలి, వాళ్లని ప్రోత్సహించాలి, వెన్ను తట్టి లేపాలన్ని సదుద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు. సమాజంలో నేడు ఎంతో పోటీ ఉందని, పిల్లల్లో కూడా ఒక్కొక్కరిలో ఒక్కొక్క రకమైన ప్రతిభ దాగి వుంటుందన్నారు. పిల్లల్లో ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల అభీష్టాన్ని గుర్తెరిగి, వారిలోని నైపుణ్యాలను వెన్ను తట్టి లేపి ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు కూడా ఏ




రంగంలో తమకు ఆసక్తి ఉందో ఆ రంగంలో లక్ష్యాలను నిర్దేశించుకుని ఉన్నత శిఖరాలను అందుకోవడానికి కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎం.వి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మనం ఎదుగుతూనే మన సమాజంలో తోటి వారి ఎదుగుదలను కూడా ఆకాంక్షించే.. మనస్తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సమాజంలో ఇంకనూ అభివృద్ధి చెందాల్సిన వారు ఎంతో మంది ఉన్నారని, వారి బంగారు భవిష్యత్తుకు సహకారం అందించాలన్నారు. జిల్లాలో 10వ తరగతి, 12వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్స్ గా అత్యుత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులుగా అవార్డులు అందుకున్న వారు భవిష్యత్తులో ఉన్నత విదులతో పాటు, అత్యున్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలను, కలలను సఫలీకృతం చేస్తున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ షైనింగ్ స్టార్స్ అవార్డులను అమలు చేయడం గర్వించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడమే కాకుండా వారి విద్యకు ఆర్థిక చేయూతను ఇవ్వడం అభినందనీయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య విధానంలో సమూలమైన మార్పులతో విద్యాభివృద్ధికి దోహదపడుతోందన్నారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ షైనింగ్ స్టార్ -2025 ప్రోత్సాహక కార్యక్రమం.. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడం జరుగుతోందన్నారు. వినూత్న ఆలోచనలకు చక్కటి వేదిక మనిషి మేథస్సు అని.. మనిషిగా ఆ మెథను మనం కలిగి ఉన్నామంటే ఎంతో అదృష్టవంతులం అని గుర్తు చేశారు. చుట్టూ ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఆత్మ విశ్వాసంతో లక్ష్యం వైపు ఆడుగేస్తే లక్ష్యం చేరుకోవడం కష్టం కాదని తెలిపారు. తప్పిదాల నుండి ఎదురయ్యే అనుభవాలే చక్కటి గుణపాఠాలు నేర్పుతాయన్నారు. సమాజంలో పిల్లల భవిష్యత్తుకు కేవలం తల్లిదండ్రులు మాత్రమే కాకుండా చుట్టుపక్కల వారు కూడా సహకారం అందించాలని కోరారు.జేసీ అదితిసింగ్ మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని వెన్ను తట్టి ప్రోత్సహించేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి, అలాగే విద్యాశాఖ మంత్రిలు షైనింగ్ స్టార్స్ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత ఆశయంతో లక్ష్యం వైపు అడుగులేయాలని విద్యార్థులకు సూచించారు. చిన్నప్పటి నుండి కూడా ఇప్పటికే ఎన్నో లక్ష్యాలను ఛేదించి విజయాలను అందుకుని ఉంటారని అక్కడక్కడా ఎదురయ్యే ఓటములను గుణపాఠాలుగా గుర్తించి చక్కటి భవిష్య ప్రణాళికతో ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను అందుకోవాలన్నారు.ఇంటర్మీడియట్ ఆర్జేడీ ఎ. శ్రీనివాసులు మాట్లాడుతూ తల్లిదండ్రులు మనకు అందించిన అవకాశాలను గుర్తెరిగి మన విద్యా, ప్రతిభ ద్వారా వారి గౌరవాన్ని మరింత పెంచేలా విలువలతో కూడిన విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తులో ఉన్నత పదవులు, అధికారులను అందుకోవాలని సూచించారు.ఆర్ఐఓ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులకు మార్కులు ముఖ్యం కాదని, నిరంతర కొత్త విషయాలు నేర్చుకోవడంతో ఉన్నత స్థానాన్ని అధిరోహించారని, విద్యార్థులు కూడా అలాంటి గుణాన్ని అలవర్చుకుంటే ఏదైనా సాధించగలుగుతామన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల మనస్సును అర్థం చేసుకోవాలన్నారు. మీ లక్ష్యాలను వారిపై రుద్దకుండా వారి యొక్క లక్ష్యాలను సాధించడంలో తోడ్పాటును అందించాలన్నారు. డీఈఓ శంశుద్దిన్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యాశాఖ వారికి, అవార్డు పొందిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. మానవతా విలువలను కోల్పోకుండా సమాజాన్ని గౌరవిస్తూ సమాజం కోసం, మన తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా అడుగులేయలన్నారు.అనంతరం వైఎస్ఆర్ కడప జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 266 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 20వేలు చొప్పున మంజూరైన రూ. 53,20,000 ల మెగా చెక్కును జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అతిథులతో కలిసి విద్యాశాఖ అధికారులు, విద్యాలకు అందజేశారు. అనంతరం ప్రశంసా పత్రాలు, మెడల్ లను జిల్లా కలెక్టర్, ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు.అంతకుముందుగా షైనింగ్ స్టార్ అవార్డు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో తమ మనోభావాలను పంచుకొని. ప్రతిభ గలిగిన విద్యార్థులను వెన్ను తట్టి ప్రోత్సహించడంతోపాటు, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి పై తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల లెక్చరర్లు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com